ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

మద్యం షాపులు బంద్

అమలాపురం టౌన్/యానాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో మద్యం షాపులు, బార్లు మూసి వేయాలని జిల్లా ఎన్నికల అధికారి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి గురువారం సాయంత్రం 4 గంటల వరకు మద్యం డిపోలు, దుకాణాలు, బార్‌లు మూసి ఉంచాలన్నారు. రెండు రోజుల పాటు యానాంలో మద్యం షాపులు మూసివేయనున్నట్టు పుదుచ్చేరి డిప్యూటీ ఎక్సయిజ్ కమిషనర్ తెలిపారు.

రేపు టీచర్స్ ఎమ్మెల్సీ పోరు

- ఉదయం 8 నుంచి పోలింగ్ - 16,737 మంది ఓటర్లు - 9న కౌంటింగ్



బి.గోపిమూర్తి | జి.నారాయణరావు | కె.నాగేశ్వరరావు | పులుగు దీపక్ | ఎన్.వెంకటలక్ష్మి

కలెక్టరేట్ (కాకినాడ)/ రాజమహేంద్రవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ నియోజకవర్గం శాసనమండలి(ఎమ్మెల్సీ) ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది.గత ఎన్నికల్లో యూటీ ఎఫ్ తరపున గెలిచిన షేక్ సాబ్జి రోడ్డు ప్రమా దంలో మృతిచెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది.ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 8 నుంచి సాయం త్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ నిర్వ హిస్తారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరగ ను న్నాయి. ఐదుగురు అభ్యర్థులు స్వతంత్రంగా బరిలో ఉం డడంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. యూటీఎఫ్ నేత బొర్రా గోపీమూర్తి, గంధం నారా యణ రావు,డా.కవల నాగేశ్వరరావు,పులుగు దీపక్, నామన వెంకట లక్ష్మి(విళ్ల లక్ష్మి) పోటీ పడుతు న్నారు. ప్రధాన పోటీ ఇద్దరి మధ్యే ఉంటుందని పరిశీలకులు అంచనా. ఇంత వరకూ హోరా హోరీగా సాగిన ప్రచారం మంగళవారం సాయంత్రం 4 గంటలతో ముగిసింది. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.16,737 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కాకినాడ జిల్లాలో 3418 మంది,తూర్పుగోదావరి జిల్లాలో 2990, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3296, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 637, పశ్చిమగోదావరి జిల్లాలో 3729,ఏలూరు జిల్లాలో 2667 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను సురక్షి తంగా కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించనున్నారు.ఈనెల 9వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తారు. ఈ నెల 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగు స్తుంది. ఎన్నికల్లో విధులు నిర్వహించేందుకు పీవోలు, ఏపీవోలు,ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు,సెక్టార్ అధికారులు, ఇతర సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.ఈ నేపథ్యంలో బుధ, గురువారాలు 144 సెక్షన్ అమల్లోకి తెచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు డీఆర్వో సీతారామమూర్తి తెలిపారు.ఆర్ట్స్ కళాశాల వద్ద పోలింగ్ సామగ్రి అందిస్తామన్నారు.

ఎన్నిక ప్రశాంతంగా జరగాలి
కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నిక స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో అన్ని మండలాల తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భారత ఎన్నికల సంఘం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఓటు వేసేందుకు క్యాజువల్ లీవ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఈ నియోజకవర్గ ఉపాధ్యాయ ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు యాజమాన్యాలు తగు వెసులుబాటు కల్పిస్తూ విధులకు ఒక గంట ఆలస్యంగా హాజరయ్యేందుకు, షిఫ్టుల అడ్జస్ట్‌మెంటు అనుమతించాలన్నారు.

వేమగిరి పంచాయతీలో విచారణ
డిప్యూటీ సీఎం పవన్‌కు ఫిర్యాదు..కదులుతోన్న డొంక

రాజమహేంద్రవరంరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : వేమగిరి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం కొవ్వూరు డీఎల్‌పీవో విచారణ చేపట్టారు.కడియం మండలం వేమగిరి గ్రామంలో నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ అదే గ్రామానికి చెందిన కె.సత్యనారాయణ ఈ ఏడాది జూలై 10వ తేదీన నేరుగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.2022లో అప్పటి గ్రామ కార్యదర్శి కే.రాజశేఖర్, డిప్యూటేషన్‌పై వచ్చిన బిల్ కలెక్టర్ కె.శ్రీనివాస్ లక్షలాది రూపాయలు నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్లాన్ అప్రూవల్‌కు రూ.10వేలు, ఇంటికి తక్కువ పన్నులు వేస్తామంటూ ఒక్కొక్క ఇంటికి రూ.5 వేలు, శానిటేషన్ తదితర పనులకు ఉపయోగించే దినసరి కార్మికులు ఒక్కొక్కరు నుంచి రూ.100, డ్రైనేజీ, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు నాసిరకంగా చేస్తూ బిల్లులు చేయించుకున్నారని ఆరోపించారు. గ్రామంలో అవినీతిపై ఎంపీడీవో, డీఎల్‌పీవో, డీపీవోలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేన్నారు.ఈ మేరకు మంగళవారం విచారణ చేపట్టారు. వేమగిరి గ్రామానికి అప్పటి ఎంపీడీవో కె.రత్నకుమారి ప్రత్యేకాధికారిగా ఉన్నారు. అయితే ఎటువంటి ఖర్చయినా ప్రత్యేకాధికారి తంబ్ వేస్తేనే బిల్లులు అవుతాయి.ఈ అవినీతిలో ఎవరిపై చర్యలు ఉంటాయో వేచి చూడాల్సిందే. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేమగిరి గ్రామానికి ప్రత్యేకాధికారిగా రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ బాధ్యతలు చేపట్టారు. పాత పద్ధతినే సదరు కార్యదర్శి రాజశేఖర్ ఇష్టానుసారంగా లక్షలాది రూపాయల బిల్లులు పెట్టడంతో కేతన్‌గార్గ్ అనుమానం వ్యక్తం చేశారు.దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదించగా.. జిల్లాస్థాయి అధికారిణి విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలంటూ కలెక్టర్ ఆదేశాలిచ్చినట్టు తెలిసింది.

సాహసం సాగరం



నావికాదళ విన్యాసాలకు కేంద్రంగా కాకినాడ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ సాగరం రక్షణపరంగా తూర్పు నావికా దళానికి అత్యంత కీలకం. గడచిన కొన్నేళ్లుగా కాకినాడ సముద్ర జలాల్లో ఇండియన్ నేవీ పలు రకాల మాక్‌డ్రిల్స్, ఎక్సర్‌సైజ్‌లతో భద్రతను పటిష్ఠం చేస్తోంది. ఈ మేరకు అమెరికన్ నేవీతో సైతం పలు రకాల ప్రత్యేక ఉమ్మడి విన్యాసాలు చేస్తూ తీరాన్ని, సముద్రజలాల సరిహద్దును కంటికి రెప్పలా కాపాడుతోంది. వాస్తవానికి నావికాదళం అంటే విశాఖలోని తూర్పునావికాదళ స్థావరంగా చెబుతారు.దీని పరిధిలో కాకినాడ సాగరం కూడా ఉండడంతో గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో వ్యూహాత్మక రక్షణ చర్యలు చేపడుతోంది. నేడు భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

దేశానికి ఆయువుపట్టు కేజీ బేసిన్

ప్రధానంగా కాకినాడ తీరం నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేజీ బేసిన్ దేశానికి అతిపెద్ద ఆయువుపట్టు. సముద్రం మధ్యలో 50 వేల చదరపు కిలో మీటర్లకుపైగా విస్తరించి ఉన్న బేసిన్‌లో 2003 నుంచి 26 బావుల్లో చమురు,గ్యాస్‌ను ఓఎన్‌జీసీ, రిలయన్స్, కెయిన్ ఎనర్జీ వంటి ప్రఖ్యాత కంపెనీలు తవ్వుతున్నాయి. లక్షల కోట్ల పెట్టుబడులతో వందలాది మంది నిపుణులు, సిబ్బంది.. పదుల సంఖ్యలో నౌకల్లో ఉంటూ ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీని రక్షణ భారత తూర్పు నావికాదళం పర్యవేక్షిస్తోంది. కేజీ బేసిన్‌లో అకస్మాత్తుగా అగ్నిప్రమాదాలు జరిగినా, విద్రోహశక్తులు కన్నేసినా దీన్ని ఎలా రక్షించుకోవాలి? అనేదానిపై ప్రతి ఏటా ప్రత్యేక మాక్‌డ్రిల్ నిర్వహిస్తోంది. వచ్చే ఏడాది మార్చిలో అమెరికన్ నేవీతో కలిసి ఈసారి విన్యాసాలు చేసేందుకు మన ఇండియన్ నేవీ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

ప్రతి ఏడాది విన్యాసాలు..

2022 అక్టోబరులో భారత నేవీ ఆఫ్‌షోర్ సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్‌ను ప్రస్థాన్ పేరుతో నిర్వహించింది. నౌకల్లోకి నేవీ విమానాలు ఎగురుకుంటూ వచ్చి భద్రత చర్యలు చేపట్టడం, బాంబులు పసిగట్టడం వంటి వాటిపైనా, నిపుణులను రక్షించి తీసుకువెళ్లడంపై మాక్‌డ్రిల్ నిర్వహించింది.2023 జనవరిలో ఆర్మీ,నేవీ,ఎయిర్‌ఫోర్స్ కలిపి కాకినాడలో యాంపెక్స్-2023 నిర్వహించాయి. తీరంలోను సముద్రంలోపల విదేశీ శక్తులు, ఉగ్రవాదులు చొరబడితే వారిని మట్టుపెట్టడం ఎలా? రక్షణ విషయంలో ఎలా చురుగ్గా వ్యవహరించాలి? వ్యూహాల అమలు..వంటివాటిపై ఎక్సర్‌సైజ్ చేపట్టాయి. 2023 ఏప్రిల్‌లో సముద్రంలో చమురు కార్యకలాపాల వల్ల సాగర జలాలు కాలుష్యం నేపథ్యంలో వాటిని ఎలా సంరక్షించుకోవాలి? సముద్రంలో బోట్లు, షిప్పులో జరిగే అగ్నిప్రమాదాల సమయంలో ఆస్తినష్టం తగ్గించుకుంటూ అందులో ఉన్న వారిని కాపాడుకోవడం ఎలా? అనే దానిపై నేవీ విన్యాసాలు నిర్వహించింది. నౌకల్లోంచి నేవీ సిబ్బంది ప్రమాద ఘటనలో ఇతర నౌకల్లో మంటలను అదుపు చేయడం, అందులోని సిబ్బందిని ప్రత్యేక బాక్సుల్లో ఈదుకుంటూ వెళ్లి రక్షించడం, హెలీకాప్టర్ల నుంచి తాడుతో దిగి వారిని కాపాడడం వంటి వాటిని సాహసోపేతంగా చేసి చూపించింది. అదే ఏడాది అక్టోబరులో చమురుసంస్థలు, కోస్ట్‌గార్డ్,కస్టమ్స్ తో కలిపి రక్షణ చర్యలు చేసి చూపించింది. నేవీకి చెందిన ఐఎన్ ఎస్ కోర,ఐఎన్ఎస్ టిహాయులు మెరైన్ కమాండోలతో కలిపి బాంబు డిస్పోజబుల్ నిపుణులు ప్రమాదాల సమయంలో ఏవిధంగా దేశ తీరజలాలను కాపాడుకోవాలో చేసి చూపించాయి.ఈ ఏడాది సెప్టెం బరులో కాకినాడలో తూర్పు నావికాదళం 47వ ప్రాంతీయ సదస్సు ఇక్కడే నిర్వహించింది. ఏటా అమెరికన్ నేవీతో కలిసి విన్యాసాలు చేస్తూ కాకినాడ తీరం,సముద్ర జలాల సరిహద్దుల్లో గస్తీ పెంచి విశేష సేవలందిస్తోంది.

విమాన విన్యాసాలు



- కేజీ బేసిన్‌లో చమురు,గ్యాస్
- లక్షల కోట్లతో నిక్షేపాలకు అన్వేషణ
- కీలకంగా మారిన భద్రత
- ఎప్పటికప్పుడు నేవీ నిఘా
- ప్రతి ఏటా ప్రస్థాన్ పేరిట మాక్‌డ్రిల్
- రక్షణ చర్యలపై అవగాహన
- వచ్చే ఏడాది మార్చిలో విన్యాసాలు
- నేడు భారత నౌకాదళ దినోత్సవం

సిద్ధమైతే.. అద్భుతమే!

కాకినాడలో సిద్ధమవుతున్న యుద్ధ విమాన మ్యూజియం



కాకినాడలో టీయూ-142ఎం యుద్ధ విమాన మ్యూజియం

సర్పవరం జంక్షన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందిన కాకినాడ బీచ్‌లో ఏర్పాటు చేసిన యుద్ధ విమాన మ్యూజియం త్వరలో సందర్శకులకు వినోదం, విజ్ఞానం అందించనుంది. దేశ భద్రత,రక్షణ కోసం త్రివిధ దళాలు అందిస్తున్న సేవలు, రక్షణ రంగంలో టీయూ-142 ఎం యుద్ధ విమానం అందించిన సేవలను మ్యూజియం రూపంలో థీమ్‌పార్కు పేరిట కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్‌లో 2020లో రూ.5.89 కోట్ల గుడా నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రెండెకరాల స్థలంలో టీయూ-142 విమాన మ్యూజియం నిర్మాణం పనుల టెండర్‌ని తెనేజా ఏరో స్పేస్ లిమిటెడ్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ఇంకా యుద్ధ విమానం లోపల ఏసీ, విద్యుద్దీకరణ, లైటింగ్ పనులు పూర్తి కావాల్సి ఉంది. ఆయుధాల నిల్వ, వాటిని ఏవిధంగా ప్రయోగిస్తారు, విమాన టేకాఫ్, ల్యాండింగ్ తదితర వివరాలు, దేశానికి అందించిన సేవలు, డిస్‌ప్లే, వీడియో, ఆడియో తదితర సమాచార వ్యవస్థ, గేమింగ్ జోన్, విజ్ఞానంపై సమాచారం ఏర్పాటు చేయాల్సి ఉంది. మ్యూజియంలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి పరిశీలిస్తే మరింత సమయం పట్టే అవకాశం ఉంది. కానీ ఇవన్నీ పూర్తయితే మ్యూజియం సందర్శకులకు కనువిందు చేయనుంది. ఇది ఎప్పుడు పూర్తవుతుందా అని జనం ఎదురుచూస్తున్నారు.

యుద్ధ విమానం ప్రత్యేకతలివే..

టీయూ-142 యుద్ధ విమానాన్ని రష్యా దేశం నుంచి కొనుగోలు చేశారు. కార్గిల్ యుద్ధంలో ఇది విశేష సేవలు అందించింది. ఒక్కసారి ఫ్యూయల్ నింపుకుని ప్రపంచదేశాలను కేవలం 16 గంటల్లో చుట్టివచ్చే సామర్థ్యం దీని సొంతం. ఇది గంటకు 925 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. విమానం పొడవు, వెడల్పులు 50 మీటర్లు, రెక్కల పొడవు 50 మీటర్లు .దీని బరువు 90 వేల కిలోలు. ప్రపంచంలోనే అతి భారీ, పురాతన యుద్ధ విమానాల్లో ఒకటైన టీయూ-142ఎం ఎయిర్‌క్రాఫ్ట్ భారత నావికాదళం వైమానిక విభాగంలో 28 ఏళ్లపాటు దేశానికి విశేష సేవలు అందించింది. సముద్ర తీర గస్తీ, జలాంతర్గామి నిరోధక సేవలు అందించడంలో ఖ్యాతి గడించిన ఈ యుద్ధ విమానం 2017లో నేవీ నుంచి వైదొలిగి, తమిళనాడులోని అరక్కోణం బేసల్ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ రాజసంలో విశ్రాంతి తీసుకుంటుంది. ఈ విమానాన్ని తమిళనాడు నుంచి కాకినాడ బీచ్‌కు 14 భారీ వాహనాల ద్వారా తెనేజా ఏరో స్పేస్ లిమిడెట్ సంస్థ తీసుకువచ్చింది.

చివరికిలా!



కోరుకొండలో కోతకు వచ్చిన పంట



కోరుకొండలో ధాన్యపు రాశిని పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ మేనేజర్ రాధిక

- వీడని తుఫాన్ భయం
- కోతలకు రైతులు దూరం
- కోరుకొండలో లబోదిబో
- 90 శాతం పంట చేలోనే

కోరుకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టం చేతికి వచ్చే సమయంలో ముందు నుయ్యి, వెనక గొయ్యి అన్న చందంగా రైతన్నల పరిస్థితి మారింది. కోరుకొండ మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం 90 శాతం వరకు కోతకు వచ్చింది. ఈ దశలో తుఫాన్ హెచ్చరికలు రావడంతో గత ఐదు రోజులుగా రైతులు వరికోతలను ఆపివేశారు. వాతావరణం మబ్బులు పెట్టి చిరుజల్లులు పడుతుండడంతో రైతాంగం భయపడుతున్నారు. మండలంలో చాలా తక్కువ మంది రైతులు మాత్రమే వరి కుప్పలు వేశారు. ఎక్కువ శాతం వరిపైరు దశలో ఉంది. కోరుకొండ మండలంలో లోతట్టు గ్రామాలైన కోటి, శ్రీరంగపట్నం, రాఘవాపురం, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, మునగాల,బుచ్చింపేట గ్రామాల్లో ముమ్మరంగా వరికోతలకు రైతులు సిద్ధపడ్డారు.అయితే అధికారుల నుంచి వస్తున్న తుఫాన్ హెచ్చరికతో కోతలకు దూరంగా ఉన్నారు. మరికొన్ని రోజులు ఆగితే ధాన్యం రెల్ల విరిగి నేలపాలై దిగుబడి తగ్గిపోతుందని కోరుకొండ, జంబూపట్నం,నర్సాపురం,గాదరాడ,గోనగూడెం, బూరుగుపూడి, దోసకాయపల్లి గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు.ఈ నేపథ్యంలో రైతులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు.తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం బహిరంగంగా ఆరబెట్టొద్దు
పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాధిక

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆరుబయట ధాన్యం నిల్వలు పెట్టవద్దని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాధికా సూచించారు. కోరుకొండ మండల పరిధిలో మంగళవారం ఆమె పర్యటించారు. ధాన్యం కోతలు నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో ఆరబెట్టిన ధాన్యపు నిల్వలు పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కోరుకొండ మండలం రాఘవపురం, బొల్లెద్దుపాలెం, పశ్చిమగోనగూడెం గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు.

ఇది శబరి లంక పొగాకు

- ఒక్క చింతూరు డివిజనుకే సొంతం
- పాత తరం ధూమపాన ప్రియులకు కిక్కు
- ఏజెన్సీలో మూడు వేల ఎకరాల్లో సాగు
- మూడు వేలమందికి పైగా ఉపాధి



శబరి లంకల్లో సాగు చేస్తున్న పొగాకు



పాకల్లో ఆరబెట్టిన పొగాకు (ఫైల్)





పొగాకు కోస్తున్న మహిళా కూలీలు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి - చింతూరు)

శబరి లంక పొగాకు.. పాతతరం ధూమపాన ప్రియులు అమితంగా ఇష్టపడే లంక చుట్టల తయారీకి వినియోగించే పంట ఇది. రెండు తెలుగు రాష్ట్రాల మొత్తంలోనూ ఒక్క చింతూరు డివిజనుకే ఈ సాగు సొంతం. గోదావరి, శబరి నదీ పరీవాహకం ఈ సాగుకు అనుకూలం. కాగా గోదావరి లంకల్లో కంటే శబరి లంకల్లో పండించిన పొగాకుకే డిమాండ్ అధికం. దీంతో విక్రయ ధర కూడా ఎక్కువే. దీనికి శబరి జలాలే కారణమని రైతులు చెబుతున్నారు. శబరి నీరు సహజసిద్ధంగా తీయదనం కలిగి ఉంటుంది. ఆ నీటిని సాగుకు వినియోగించడంతో చుట్టలు రుచికరంగా ఉంటాయని ధూమపాన ప్రియులు, వ్యాపారస్తులు చెబుతుంటారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో ఈ సాగు అధికం. స్థానిక రైతులే కాకుండా రాజమండ్రి పరిసర ప్రాంత కౌలు రైతులు కూడా ఇక్కడికొచ్చి సాగుచేస్తున్నారు. ఒక్క ఎకరా లంక కౌలు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పలుకుతుంది. అక్టోబరులో సాగు మొదలై ఫిబ్రవరి నెలాఖరుకల్లా విక్రయ లావాదేవీలన్నీ ముగిసిపోతుంటాయి. అన్నీ అనుకూలిస్తే రైతు ఇంట కాసుల పంటే. ప్రతికూల పరిస్థితులు ఎదురైతే నష్టాలు తప్పవు. ఒక ఎకరా సాగు చేయాలంటే రూ.లక్ష నుంచి నుంచి రూ.లక్షా 20వేల వరకు పెట్టుబడి అవసరం. ఎకరాలో గరిసెన్నర వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కాలం కలిసొస్తే రెండు గరిసెల వరకు కూడా దిగుబడి వచ్చే అవకాశం లేకపోలేదు. మొక్క నాటిన నుంచి 105వ రోజుకు ఆకు పరిపక్వత దశకు చేరుతుంది. తర్వాత ఆకు కోసి తాత్కాలిక పాకల్లో నెలరోజుల పాటు ఆరబెట్టాల్సి ఉంది. అనంతరం 24 కేజీల వంతున ఒక్కో తాటాకు బుట్టల్లో నిల్వ చేస్తుంటారు. అటువంటి 30 బుట్టల పొగాకును కలిపితే ఒక గరిసెగా లెక్కిస్తుంటారు. గరిసె పొగాకు ధర రూ.లక్ష నుంచి రూ.లక్షా 50వేల వరకు ఉం టుంది. చింతూరు డివిజనులో పండించిన పొగాకును రాజమండ్రి పరసర ప్రాంతాలైన ములకల్లంక, సీతానగరం, చివిడిలంక, కొత్తపేట తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. కాగా గతేడాది గుంటూరుకు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ రంగంలోకి దిగింది. విదేశాలతో ఒప్పందం కుదుర్చుకున్న ఆ కంపెనీ శబరి లంకల్లో పండించిన గరిసె పొగాకును రూ.2 లక్షల 30 వేల వరకు ధర వెచ్చించి కొనుగోలు చేసింది. ఇదొక చరిత్రగా రైతులు అభివర్ణిస్తున్నారు. అంతేకాదు ఈ ఏడాది కూడా తామే కొనుగోలు చేస్తామని సదరు కంపెనీ రైతులతో ఒప్పందం చేసుకుంది. ఆ కంపెనీ ఇతర దేశాలకు శబరి లంక పొగాకును ఎగుమతి చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగింది.



క్రిస్మస్ ‘ట్రీ’

లూథర్‌గిరిలో ఆకట్టుకుంటున్న స్టార్స్‌తో అలంకరించిన చెట్టు

క్రిస్మస్ సందడి ఆరంభమైంది. చర్చిలు, క్రైస్తవ మిషనరీ సంస్థల కార్యాలయాలు, క్రైస్తవ సోదరుల గృహాలను విద్యుద్దీపాలతో అలంకరణలు చేసుకుంటున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు, ధవళేశ్వరం, అనపర్తి, కోరుకొండ, నిడదవోలు తదితర ప్రాంతాల్లో పురాతన చర్చిలను ముస్తాబు చేశారు. రాజమహేంద్రవరంలోని పురాతన చర్చ్ సెయింట్ పాల్స్, సెయింట్ పీటర్, లూథర్‌గిరి చర్చిలు సందడిగా మారాయి. లూథర్‌గిరిలో ఒక చెట్టుకు స్టార్లను ఏర్పాటుచేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం సిటీ



హెచ్‌సీ అబ్రహంకు ప్రసంసాపత్రం అందిస్తున్న దీపిక

కాంస్య పతకం సాధించిన ఏపీఎస్పీ హెచ్‌సీ అబ్రహాం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల నాగాలాండ్ రాష్ట్రం దీమాపూర్‌లో నిర్వహించిన 25వ అఖిల భారత పోలీస్ బ్యాండు పోటీల్లో బిగిల్ కాల్ పోటీలో ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించిన ఏపీఎస్పీ హెడ్‌కానిస్టేబల్ ఎస్ అబ్రహాన్ని ఏపీఎస్పీ కమాండెంట్ ఎం. దీపిక అభినందించారు. మంగళవారం కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ బెటాలియన్‌లో అబ్రహాన్ని అభినందించి ప్రశంసాపత్రాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 24 టీమ్‌లు పాల్గొనగా ఏపీఎస్పీ.. ఏపీ పోలీస్ బిగిల్ టీం కాంస్య పతకం సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు పాల్గొన్నారు.

డ్రైవర్ చేతిలోకి గేర్ రాడ్!

ఏడీబీ రోడ్డులో ఘటన.. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు



రాజానగరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం.. సుఖమయం.. ఇది సంస్థ ట్యాగ్‌లైన్.. ఇటీవల ఆర్టీసీ బస్సులను చూస్తే మాత్రం ఎక్కడ ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంభయంగా ఉంటోంది.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.. అదేదో సినిమాలో కామెడీ కోసం.. స్పీడ్‌గా వెళుతున్న బస్‌లో స్టీరింగ్ ఊడి చేతిలోకి వచ్చేస్తుంది.. అచ్చంగా ఇలాగే మంగళవారం వేగంగా వెళుతున్న ఒక ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు స్టీరింగ్ ఊడి చేతికి వచ్చేయడంతో అటు డ్రైవర్.. ఇటు ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. కాకినాడ జిల్లా తూర్పు గోదావరి జిల్లాల మధ్య ఉండే ఏడీబీ రోడ్డు గత ఐదేళ్లగా కనీస మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఎక్కడికక్కడ గోతులతో నిండి ఉంది. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్డు పనులు ఆరంభించినా ఇంకా పూర్తికాలేదు. ఆ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడ నుంచి రాజమహేంద్రవరానికి ఏపీ 05 జడ్ 5247 ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు బయలుదేరింది. అందులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. నాన్‌స్టాప్ కావడంతో బస్ వేగంగా వెళుతోంది. 3.30 గంటలకు తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం రామస్వామిపేట సమీపంలోకి వచ్చేసరికి పెద్ద గొయ్యి కనబడడంతో డ్రైవర్ స్లో చేద్దామని గేర్ రాడ్డుపై చేయి వేశాడు.. అంతే గేర్ రాడ్డు ఊడి చేతిలోకి వచ్చేసింది. దీంతో డ్రైవర్ హతాశుడయ్యాడు.. ఇది గమనించిన బస్సులోని ప్రయాణికులు భయంతో వణికిపోయారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బస్సును నెమ్మదిగా అదుపుచేసి రహదారి పక్కన నిలపడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. దీంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్‌కు అభినందనలు తెలిపారు.

వాడపల్లి వెంకన్న కార్తీక ఆదాయం రూ.3.37 కోట్లు

ఈవో సూర్యచక్రధరరావు వెల్లడి



ఆత్రేయపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని కార్తీక మాసంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. దీంతో అధిక ఆదాయం లభించింది. ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు కార్తీకమాస ఆదాయం రూ.3,37,13,952 లభించిందని తెలిపారు. ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, వేదాశీర్వచనం, లడ్డూ విక్రయాలు, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవల ద్వారా ఈ మొత్తం లభించిందన్నారు. భక్తుల సౌకర్యార్థం మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్టు వివరించారు.

అన్నవరం దేవస్థానం పీఆర్వోగా కొండలరావు

పలువురికి అంతర్గత బదిలీలు

అన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం పీఆర్వోగా కె.కొండలరావును నియమిస్తూ ఈవో త్రినాథరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ క్యాడర్లలో 14మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇప్పటివరకు పీఆర్వోగా ఉన్న బీవీ రెడ్డికి లీజులు, రవాణా, సెక్యూరిటీ బాధ్యతలు అప్పగించారు. సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్‌ను రిసెప్షన్ బాధ్యతల నుంచి తప్పించారు. కేవలం సెంట్రల్ స్టోర్స్ మాత్రమే చూడాలన్నారు. కె.సూర్యనారాయణకు రవాణా, జె.రామకృష్ణకు అన్నదానం, ఎంవీకే సుబ్రహ్మణ్యానికి ఆలయ రిసెప్షన్ విభాగాలు కేటాయించారు. సీనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో గంటా విష్ణుకు రెండువేల వ్రతాలు, రిసెప్షన్, రికార్డ్ అసిస్టెంట్ సంగన వీర్రాజుకు 1500 వ్రతాలు కేటాయించారు. కోరుకొండ ఆలయ లెక్కల్లో అవకతవకలు ఆరోపణలు ఎదుర్కొన్న అనిల్‌కుమార్‌కు కంప్యూటర్ వర్క్, కొంతం సతీష్‌కు పరిపాలనా విభాగ బాధ్యతలు అప్పజెప్పారు.



డిస్క్‌త్రో చేస్తున్న దివ్యాంగ విద్యార్థి. విజేతకు బహుమతి ప్రదానం



ఆటపాటలతో సందడి

కాకినాడలో వేడుకగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటపాటలతో విభిన్న ప్రతిభావంతులు సందడి చేశారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఇందుకు వేదికగా నిలిచింది. కాకినాడ జేఎన్టీయూ అలుమ్ని ఆడిటోరియంలో మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ పూర్తి అదనపు బాధ్యతల సహాయ సంచాలకుడు వీవీవీఎస్ లక్ష్మణరావు ఆధ్యక్షత వహించారు. విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక పాఠశాల ఉమామనోవికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ రామారావు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ కో-ఆర్డినేటర్ సీహెచ్ సుబ్బారావు, అంధ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణికంఠస్వామి, ఆశ్రయ వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు పి.సురేష్‌కుమార్ అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. విభిన్న ప్రతిభావంత విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, 351 మందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కోరుకొండ మండలం మధురపూడిలోని కన్నా ఆశ్రయ్ మానసిక దివ్యాంగుల కేంద్రం విద్యార్థులకు మొత్తం 12 బహుమతులు లభించాయి. విభిన్న ప్రతిభావంతులకు ఉత్తమ సేవలందిస్తున్న సంఘాల ప్రతినిధులు 34 మందిని, స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ప్రత్యేక పాఠశాలలు నిర్వహిస్తున్న ప్రతినిధులను సత్కరించారు. పులిమేరు శాంతివర్ధని స్పెషల్ పాఠశాల ప్రతినిధి, మహర్షి బులుసు సాంబమూర్తి పాఠశాల హెచ్‌ఎం, కాకినాడ ప్రభుత్వ బధిరుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సామర్లకోట సిరి స్పెషల్ పాఠశాల ప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతుల సేవా సంస్థల ప్రతినిధులు జి.కొండలరావు, నిమ్మకాయల సురేష్, కొసన సత్య సుబ్రహ్మణ్యం, బీవీవీ సత్యనారాయణ, యు.శ్రీనివాస్, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులు, సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛంద సంస్థ ప్రతినిధికి సత్కారం

ఘనంగా అయ్యప్ప పడి పూజ



18 మెట్లపై దీపాలు వెలిగించిన దృశ్యం

మోతుగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి తెల్లవారుజామున నాలుగు గంటలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సత్తిబాబు, జి.రవి సాయంతో మధ్యాహ్నం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. సాయంత్రం 18 కలశాలతో పడి పూజ ఘనంగా జరిగింది. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు దంపతులు, సీనియర్ అక్కౌంట్స్ ఆఫీసర్ వరప్రసాద్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెంటకోట సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన పూజలో అయ్యప్ప కమిటీ సభ్యులు టి.ప్రసాద్, పప్పు చిరంజీవి, జి.రవి, సత్తి బాబు, నాగేష్ రాజా, శ్రీను, భీమరాజు, పప్పు వెంకటేశులతో పాటు మోతుగూడెం, సీలేరు, డొంకరాయి, ఫోర్‌బై, పొల్లూరు, చింతూరు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంటకు చెందిన అనేక మంది స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

నేడు, రేపు రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికలు

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4, 5 తేదీల్లో సామర్లకోట సీనియర్ సెక్షన్ ఇంజనీరు కార్యాలయంలో పోలింగ్ జరుగుతుందని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సామర్లకోట బ్రాంచి కార్యదర్శి ఎం.రమేష్ మంగళవారం రాత్రి తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుంది, సామర్లకోట బ్రాంచి పరిధిలో అటు కేశవరం నుంచి ఇటు హంసవరం వరకు గల సుమారు 650 మంది రైల్వే కార్మికులను బరిలో ఉన్న వివిధ కార్మిక యూనియన్ల నాయకులు కలిసి తమ సంఘాన్ని బలపరచాల్సిందిగా అభ్యర్థించారు. రైల్వే కార్మికులకు అత్యంత ప్రతిష్ఠాత్మకం అయిన ఈ గుర్తింపు ఎన్నికల్లో ఆధిపత్యం నిరూపించుకునేందుకు పోటీ హోరాహోరీగా సాగనుంది. ఈ నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రమణీయం... శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

వైభవంగా శ్రీయాగ సహిత సుదర్శన నారసింహ యాగం

కాకినాడ భానుగుడి సెంటరు నుంచి వేలాది మంది భక్తులతో శోభాయాత్ర



సర్పవరం జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని పాలకులు సుభిక్షమైన పాలన అందించి, ప్రగతి పథంలో పయనింపచేసేందుకు కృషి చేయాలని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయరు స్వామి పేర్కొన్నారు. మంగళవారం కాకినాడ జేఎన్టీయూ ఎదురుగా గల మైదానంలో శ్రీరామ సేవా సమితి, వికాస తరంగిణి, శ్రీవారాహి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామ పాదుకా పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. వారం పాటు నిర్వహించే విశ్వశాంతి శ్రీయాగ సహిత సుదర్శన నారసింహ యాగాన్ని వైభవంగా ప్రారంభించారు. వేలాదిగా హాజరైన భక్తులకు జీయరు స్వామి అనుగ్రహభాషణ చేశారు. శ్రీరామచంద్రుడు మానవత్వం, సేవాతత్పరతతో సమాజ అభివృద్ధికి ఇతోధిక కృషి చేశారన్నారు. కులమతాలకతీతంగా సమస్త జనులపై ప్రేమ, వాత్సల్యం చూపించిన మహనీయుడు శ్రీరాముడు అన్నారు. సత్యవ్రతుడైన శ్రీరాముడు భరతుని కోరిక తిరస్కరించగా, శ్రీరామ పాదుకలనాశ్రయించిన భరతుడు రామరాజ్యాన్ని తరించాడన్నారు. సర్వమానవాళి దోషాలను తొలగించే విధంగా శాంతి, సమాజ శ్రేయస్సులను ప్రజలకు అందించి పాదుకా పట్టాభిషేకం తలపెట్టారన్నారు. శ్రీరామ పాదుకారాధన వైభవాన్ని భరతుడు లోకానికి చాటగా, రామ పాదుకా మహిమను ఎందరో విశిష్టంగా కొనియాడారన్నారు. శ్రీరామ పాదుకల విశిష్టత, చరిత్ర ఘట్టాలను రామాయణ సంస్కృత శ్లోకాలతో వివరించారు. తొలుత చినజీయరు స్వామి స్వీయ పర్యవేక్షణలో కాకినాడ భానుగుడి సెంటరు నుంచి జేఎన్టీయూ ప్రాంగణానికి వేలాది మంది భక్తులతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామ్‌నారాయణ్ పెరుమాళ్ పీఠాధిపతి శృంగారం తిరువేంగళ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



చినజీయరు స్వామి భాషణను వింటున్న భక్తులు

కాకినాడ పోర్టులో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

విజయవాడ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండేందుకు అందరూ సహకరించాలని విజయవాడ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేని పీడీఎస్ బియ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రవాణా చేయకుండా ఎగుమతి, దిగుమతి దారులు, ఛాంబర్ ప్రతినిధులు, ఏజెంట్లు వ్యాపారులు సహకరించాలన్నారు. మంగళవారం కాకినాడ కస్టమ్స్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు.అయన మాట్లాడుతూ కాకినాడ ఓడరేవులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 24గంటలు పనిచేసేలా ఒక చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ వివిధ వాహనాల ద్వారా సరఫరా అయ్యే సరుకులు పౌరసర ఫరాలశాఖ నుంచి నిరభ్యంతక పత్రం, బిల్లులు తీసుకున్న తర్వాతే ఎగుమతికి అనుమతించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణరాజు యాదవ్, అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, ఎసీసీ జీ.నాయుడు, ఎంకరేజ్ ఆఫీసర్ ధర్మశాస్త్ర, జిల్లా రైస్ ఎగుమ తిదారుల సంఘం అధ్యక్షుడు బీవీ కృష్ణారావు, స్టీవ్ డోర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

రూ.3లక్షల నగదు, 48గ్రాముల బంగారం స్వాధీనం


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

ఆలమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్లలో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రూ.3లక్షల నగదు, 48గ్రాములు బంగారం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ కేసు వివరాలను వెల్లడించారు. చొప్పెల్ల గ్రామంలో విశ్వనాధుల వీరభద్రరావు ఇంట్లో నవంబరు 25న రాత్రి దొంగతనం జరిగింది. వీరభద్రరావు 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్, ఇన్‌చార్జ్ ఎస్ఐ రాము ఆధ్వర్యంలో జరిగిన విచారణలో ఈనెల 3న సీఐ విద్యాసాగర్ చొప్పెల్ల సెంటర్లో ఇద్దరు నిందితులను రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలుకు చెందిన తమ్మ వినోద్‌కుమార్, ఏలూరు పవన్‌కళ్యాణ్‌ను అరెస్టు చేసి విచారించారు. వారి నుంచి రూ.3లక్షల నగదు, 48గ్రాముల బంగారు నక్లెస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆలమూరు ఇన్‌చార్జి ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు. ఈ కేసు చేధించడంతో కీలకంగా నిలిచిన కొత్తపేట డీఎస్పీ గోవిందరావు, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ అశోక్, ఇన్‌చార్జ్ ఎస్ఐ రాము, ఇబ్బంది ఎస్.బ్లెసన్, పి.గంగాధర్, బి. నెహ్రూ, బి.శ్రీనివాసరావు, సీహెచ్.దుర్గాప్రసాద్, పి.రాజు, కెవీ.రవికుమార్‌లను ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

తాటిపాకలో పట్టపగలే చోరీ

17 కాసుల బంగారం.. అర కిలో వెండి, రూ.లక్షా 10వేల నగదు దొంగతనం


తాటిపాకలో చోరీ జరిగిన ఇంట్లోని బీరువాను పరిశీలిస్తున్న రాజోలు ఎస్ఐ రాజేష్‌కుమార్

రాజోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాక సెంటర్‌లో గుబ్బల తాతారావుకు చెందిన ఇంట్లోకి సోమవారం సాయంత్రం దొంగలు చొరబడి 17 కాసుల బంగారం, అరకిలో వెండి, రూ.లక్షా 10వేల నగదు మొత్తం రూ.4లక్షల 70 వేలు సొత్తును దోచుకువెళ్లారని రాజోలు ఎస్ఐ బి. రాజేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం... తాటిపాక సెంటర్‌లో తాతారావు తూకం దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణం ఎదురుగా ఉన్న రోడ్డు గల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇంటికి తాళం వేసి యథావిధిగా సోమవారం ఉదయం భార్యాభర్తలిద్దరూ దుకాణానికి వచ్చారు. మళ్లీసాయంత్రం 6 గంటలకు ఇంటికి వెళ్లి చూడగా బీరువా పగులకొట్టి, దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వెంటనే తాతారావు రాజోలు పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ రాజేష్‌కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. తాతారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏపీటీలో పాలీటెక్ ఫెస్ట్ ప్రారంభం

కాకినాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని నైపుణ్యాల ప్రదర్శనకు టెక్ ఫెస్ట్ చక్కని వేదికని జేఎన్టీయూకేలోని యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు అన్నారు. కాకినాడ ఏపీటీలో నిర్వహించిన ప్రాంతీయ పాలీటెక్ ఫెస్ట్-2024ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.జనార్ధనరావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మోహన్‌రావు, గౌరవ అతిథులుగా కేఎస్‌పీఎల్ డీజీఎం పి.రవికుమార్, రామసత్యనారాయణ, సురేష్ హాజరయ్యారు. సాంకేతిక విద్యా శాఖ, ఏపీప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల 20 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 117 ప్రాజెక్టులను ప్రదర్శించారు. కాకినాడ జిల్లాలో గల 21 మండలాల నుంచి పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలను తిలకించారు. పాలీటెక్ ఫెస్ట్ బుధవారం కూడా కొనసాగనుందని ప్రిన్సిపాల్ తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

దమ్ము ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

రాజానగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం నమ్ముకున్న ట్రాక్టరే మృత్యుశకటమైంది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నరేంద్రపురంలో పొలంలో దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ తిరగబడి డ్రైవర్ మృతిచెందాడు. గ్రామానికి చెందిన వెలుగుల శివ(31) గ్రామంలో దాళ్వా సీజన్‌కు సంబంధించి మంగళవారం దమ్ము చేస్తూ ట్రాక్టర్ గట్టు ఎక్కుతుండగా వెనక్కి తిరబడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో శివ బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతిచెందాడు. దీనికి తోడు ట్రాక్టర్ ట్యాంకులోని వేడెక్కిపోయిన డీజిల్ కూడా డ్రైవర్ శరీరంపై పడడంతో ఒళ్లంతా గాయాలయ్యాయి. ప్రొక్లెయినర్ సహాయంతో ట్రాక్టర్‌ను తొలగించి బయటకు తీసేసరికి శివ అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా శివకు భార్య, ఓ బాబు, పాప ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మనోహర్ తెలిపారు.


సంఘటనా స్థలంలో మృతి చెందిన డ్రైవర్ శివ

రుడాకు కొత్త మాస్టర్ ప్లాన్

- 3వేల చదరపు మీటర్ల మేర అమలు యోచన
- పుష్కరాల నాటికి రివర్‌ఫ్రంట్ సుందరీకరణ
- ఈనెల 31 నుంచి భవన అనుమతులు సులభతరం
- ఆంధ్రజ్యోతితో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి

రాజమహేంద్రవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ప్రయత్నాలు ప్రారంభించాం. గుడా ఉండగా సుమారు 200 చదరపుకిలోమీటర్ల పరిధిలో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. కానీ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో రుడా పరిధిలోని మొత్తం ఏరియాను కలుపుతూ సుమారు 3 వేల చదరపు కిలోమీటర్లు కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నట్టు రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. దేశంలోనే మంచి ఎక్స్‌పర్ట్‌లైన కన్సల్టెన్సీలతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. రుడా పరిధిలో తూర్పుగోదావరి జిల్లాతో పాటు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట, మండపేట నియోజకవర్గాల్లోని కొంతభాగం, రామచంద్రపురం టౌన్ కూడా ఉందన్నారు. మొత్తం ఏరియాని అర్బనీకరించే విధంగా విశాలమైన రోడ్లు, వాన నీరు ఎక్కడా నిల్వలేకుండా ఉండడం కోసం స్టార్మ్‌వాటర్ డ్రైనేజీ సిస్టమ్, గ్రామాల్లో కూడా పారిశుధ్య సమస్యలు లేకుండా చూడడం కోసం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్‌ను మండల పరిధిలోకానీ,నియోజకవర్గ పరిధిలో కానీ చేసేట ట్టు ఉంటే బాగుంటుందనే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మంచినీటి సరఫరా కూడా అన్ని ప్రాంతాలకు ఉండే విధంగా ఈ మాస్టర్‌ప్లాన్‌లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పార్కులు, స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్, పేదల కోసం వెల్ఫేర్ హౌసింగ్, మధ్య తరగతి ఇతర వర్గాలకు ఎఫర్డబుల్ హౌసింగ్, ఇండస్ట్రియల్ టౌన్ షిప్‌కు అనుకూలంగా మాస్టర్ ప్లాన్ ఉంటుందన్నారు. హౌసింగ్ ఇతర సౌకర్యాలను రుడా, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో రూపొందించనున్నట్టు స్పష్టం చేశారు. రుడా ద్వారా ప్రజల ఇళ్లు, ఇతర నిర్మాణాల విషయంలో ఇబ్బందులు లేకుండా చూస్తామని, ఈ నెల 31 నుంచి జీ ప్లస్ 5 అంతస్తుల వరకూ ఎవరు భవనాలు నిర్మించుకున్నా ఆఫీసుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగన వసరం లేదన్నారు. లైసెన్స్ సర్వేయర్‌తో ప్లాన్ గీయించుకుని.. ఆన్‌లైన్‌లో పెడితే అదే డీమ్డ్ అప్రూవల్ అవుతుందన్నారు. పనులు ఆరంభించే టప్పుడు రుడా, ఆర్ఎంసీ సిబ్బంది ఎవరైనా వచ్చి పరిశీలించి ఎన్‌వోసీ ఇస్తారన్నారు. ఇక ఎవరి ప్రమేయం లేకుండా కట్టడం నిర్మించుకోవచ్చని చెప్పారు. రుడా ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే మార్గాలు పరిశీలిస్తున్నామని, ఖాళీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడంతోపాటు పార్కుల వద్ద షాపులు నిర్మిస్తామన్నారు. వీటి అద్దెల ద్వారా ఆదాయం వస్తుందని చెప్పారు. మినీ సోలార్ ప్లాంట్లు నిర్మించే ఆలోచన ఉందన్నారు.


రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి

అన్ని ప్రాంతాల్లో సుందరీకరణ..

2027లో వచ్చే గోదావరి పుష్కరాల నాటికి గోదావరిని ఆనుకుని ఉన్న అన్ని ప్రాంతాల్లో రివర్‌ఫ్రంట్ సుందరీకరణ చేస్తామని ఛైర్మన్ తెలిపారు. రాజమహేంద్రవరం సిటీలో పర్వాలేదని, దానితో పాటు రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడదవోలు, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే మొత్తం రివర్‌ఫ్రంట్‌ను సుందరీకరించి..కనీసం సైకిల్ వాక్‌కు అనుకూలంగా ఉండేటట్టే చేసే ఆలోచన ఉందన్నారు. రుడా పరిధిలో గత ప్రభుత్వంలో చేసిన పనుల నిర్వహణ ఎవరనేది స్పష్టత లేదని, అనేక గ్రామాల్లో జిమ్‌లు నిర్మించినా నిర్వహణ బాధ్యత ఎవరికీ అప్పగించకుండా వది లేశారన్నారు. తాము దీర్ఘకాలిక ప్రయోజనంతో పాటు నిర్వహణ కూడా ఉండే పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు స్పష్టంచేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మీటింగ్ పెట్టి గతంలో అనుమతుల్లేకుండా కట్టిన కట్టడాలు, వచ్చే ఆదాయం వంటి వాటిపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

కీచక ఉపాధ్యాయులు!

- నాగుల్లంకలో విద్యార్థినులపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు
- సండే స్కూలు టీచర్ వద్ద విషయం బయటపెట్టిన విద్యార్థినులు
- ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు, స్థానికులు
- బొమ్మూరులో బాలికను లైంగికంగా వేధించిన హిందీ ఉపాధ్యాయుడి అరెస్ట్


నాగుల్లంకలో ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేస్తున్న తల్లిదండ్రులు, పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

పి.గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పుతూ తండ్రి స్థానంలో ఉండవల్సిన ఉపాధ్యాయుడు గురువు అనే పదానికే మాయని మచ్చ తెచ్చాడు. చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతూ తన వెకిలి చేష్టలతో పిల్లలను ఇబ్బందిపెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్న ఆ ఉపాధ్యాయుడికి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక ప్రాథమిక పాఠశాలలో జరిగింది. విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..... రాజోలు మండలం మెరకపాలెం గ్రామానికి చెందిన పిండి శ్రీనివాస్ ఎంటీఎస్ (మినిమమ్ టైమ్ స్కేలు) ఉపాధ్యాయుడిగా మూడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పొన్నమండతో పాటు పి.గన్నవరం మండలంలోని ముంగండ, జొన్నల్లంక ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసి సెప్టెంబరు 11న నాగుల్లంక ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరాడు. 1,2 తరగతులకు హెచ్ఎం కె.గంగాభవానితో పాటు పాఠాలు శ్రీనివాస్ పాఠాలు చెప్పేవాడు. అయితే హైస్కూల్లో తరగతి గదులు లేకపోవడంతో 3,4,5 తరగతులకు ప్రాథమిక పాఠశాలలోనే పాఠాలు చెప్తున్నారు. ఈక్రమంలో గ్రామంలో సండే స్కూలు నిర్వహిస్తున్న చవ్వాకుల వల్లి ప్రతీ వారం విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తుంది. అయితే ఈనెల 2వ తేదీన గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై చెప్తున్న సమయంలో మా స్కూల్లో ఉపాధ్యాయుడు బ్యాడ్ టచ్‌లు చేస్తున్నాడు అంటూ ఓ విద్యార్థి సండే స్కూలు టీచర్ దృష్టికి తీసుకువచ్చింది. అసలు ఉపాధ్యాయుడు ఎలా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థులను వల్లి ఆరా తీయగా ఉపాధ్యాయుడు చేస్తున్న చేష్టలను ఒక్కొక్కటిగా వివరించారు. విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు చేరడంతో హెచ్ఎం గంగాభవానిని నిలదీశారు. దీంతో స్థానిక మహిళ పోలీసు, మండల విద్యాశాఖ అధికారిణి కె.హెలీనా పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఆ కీచక ఉపాధ్యాయుడు ఆరుగురు విద్యార్థులపై చేసిన వికృత చేష్టలు సైతం బయటపడ్డాయి. పైగా విద్యార్థులే మీద పడేవారని, ఆ సమయంలో తగిలి ఉండవచ్చునని ఉపాధ్యాయుడు సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. అంతేకాకుండా ఈ కీచకుడు బాగోతాలను ప్రత్యక్షంగా పాఠశాలలో ఆయా చూసి హెచ్ఎం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. అలాగే విద్యార్థులకు డబ్బులు ఎరగా చూపి మచ్చిక చేసుకునేవాడని విచారణలో బయటకు వచ్చాయి.

ఇదిలా ఉండగా ఆవేదనతో రగిలిపోతున్న విద్యార్థులు తల్లిదండ్రులు, స్థానిక యువకులు ఉపాధ్యాయుడికి పలుమార్లు దేహశుద్ధి చేశారు. పోలీసులు జోక్యంతో స్థానికులు శాంతించగా పాఠశాలకు చేరుకున్న అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవి సిబ్బందితో ఉపాధ్యాయుడిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామని, విద్యార్థుల వాంగ్మూలం నమోదు చేయడంతో పాటు తల్లిదండ్రుల ఫిర్యాదును స్వీకరించి విషయాన్ని డీఈవో షేక్ సలీంభాషాకు తెలియజేసినట్టు ఎంఈవో కె.హెలీనా తెలిపారు. ఈ విచారణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.వెంకటలక్ష్మి, మహిళా పోలీసు పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న ఉపాధ్యాయుడి అరెస్టు

పోక్సో కేసు నమోదు

ధవళేశ్వరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరులో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో బాలికను లైంగికంగా వేధించిన హిందీ ఉపాధ్యాయుడు తంగేటి సత్యనారాయణపై ధవళేశ్వరం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సీఐ టి.గణేష్ మంగళవారం సత్యనారాయణను అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించింది.


అరెస్ట్ అయిన ఉపాధ్యాయుడు సత్యనారాయణ

శివోహం

పిఠాపురంలో వైభవంగా శివస్వాముల నగరోత్సవం


పిఠాపురంలో రథాన్ని లాగుతున్న దృశ్యం

పిఠాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వాముల శివనామస్మరణతో కాకినాడ జిల్లా పిఠాపురం మార్మోగింది. శివస్వాముల నగరోత్సవం వైభవంగా జరిగింది. శివమాల ధరించి దీక్ష పూర్తి చేసిన స్వాములకు మంగళవారం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో ఇరుముడిధారణ జరిగింది. అర్చక, గురుస్వాములు స్వాములను ఇరుముడి ధరింపచేశారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో శివస్వాముల నగరోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఉంచి వీధుల్లో లాగారు. రథోత్సవాన్ని పాదగయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ప్రారంభించారు. కొంతదూరం స్వామి రథాన్ని లాగారు. అనంతరం శివనామస్మరణ చేసుకుంటూ డప్పులు వాయిద్యాలతో ముందుండగా పట్టణంలో శివస్వాములు ప్రదర్శనగా తిరిగారు.


నగరోత్సవంలో పాల్గొన్న శివస్వాములు

ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

- మున్సిపల్ ఆర్డీ నాగ నరసింహారావు
- ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని మున్సిపల్ ఆర్డీ సీహెచ్. నాగ నరసింహారావు అన్నారు. మంగళవారం రామచంద్రపురం పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి సమస్యలు మన దృష్టికి తీసుకువచ్చినా వాటికి పరిష్కారం చూపే బాధ్యత అందరిపైన ఉందన్నారు. ప్రజా సమస్యలు సామరస్యధోరణిలో స్వీకరించి వాటికి పరిష్కారం సాధ్యమైనంత త్వరగా చూపితే ప్రజల్లో పురపాలక సంఘాల పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. తడిచెత్త పొడి చెత్త రీసైక్లింగ్ చేయడం కారణంగా పురపాలక సంఘానికి ఆదాయం సమకూరుతుందన్నారు. కంపోస్టు యార్డు స్థలాలు కూడా సరిపోతాయన్నారు. లేకపోతే కంపోస్టు యార్డు ఎంత స్థలం ఉన్నా సరిపోదన్నారు. పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉంటున్న తరుణంలో ఆదివారం పారిశుధ్య కార్మికులు, శానిటరీ కార్యదర్శులను ఉపయోగించుకుని బదులుగా వారికి అవసరమైన రోజు సెలవులు మంజూరు చేయాలన్నారు. వీలును బట్టి సిబ్బందిని సర్దుబాటు చేయాలన్నారు. పురపాలనకు సంబంధించి ఆస్తిపన్నులు వసూలు, పన్నులు విధింపు, పారిశుధ్యం, లిక్విడ్‌వేస్ట్ మేనేజ్‌మెంటు, సోలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంటు, పీకల్ స్ట్రక్చర్ మేనేజుమెంటు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇతర అభివృద్ధి పనులు, ఇతర విషయాలపై అంశాల వారీగా పురపాలక సంఘాలపై అధికారులతో సమీక్ష చేశారు. రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ వి.అయ్యప్పనాయుడు, డీఈ శ్రీకాంత్, సూపరింటెండెంట్ జి.రాధాకృష్ణ, మండపేట, అమలాపురం, మండపేట, కొవ్వూరు, నిడదవోలు కమిషన్లు, ముమ్మిడివరం కమిషనర్, పురపాలక సంఘాల అన్ని విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యను పరిష్కరించే వరకు పోరాటం'

గోకవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ బాధితుల సమస్యను పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని సామాజిక ఉద్యమనేత పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. గ్రామంలోని దళితవాడలో అస్సాగో బాధితులను మంగళవారం ఆయన, తన సతీమణి శ్రీదేవితో కలిసి పరామర్శించారు. సూర్యచంద్ర మాట్లాడుతూ పరిశ్రమ నుంచి వెలువడే వాయు, శబ్ద, జల కాలుష్యాలను నియంత్రించాలని 3నెలలుగా ప్రజలు నిరసనలు తెలియజేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం, పైగా 144సెక్షన్ విధించి గ్రామస్థులను భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. సమస్యను పూర్తిగా పరిష్కరించేవరకు ప్రజల తరుపున తన పోరాటం ఆగదన్నారు. దీనిలో భాగంగా ప్రతీ ఇంటి వద్ద ప్రభుత్వానికి తెలిసేలా నల్ల జెండాను ఏర్పాటు చేయాలని బాధిత గ్రామాల ప్రజలకు సూర్యచంద్ర పిలుపునిచ్చారు. సూర్యచంద్ర దంపతుల వద్దకు పోలీసులు చేరుకుని శాంతిభద్రతల దృష్ట్యా గ్రామంలో సమావేశాలు, సభలు ఏర్పాటు చేయరాదని సూచించారు. జగ్గంపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి మరోతి శివగణేష్ గ్రామంలోకి వస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కాగా గ్రామంలో 144 సెక్షన్‌ను అతిక్రమించిన సూర్యచంద్ర, శివగణేష్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.


జగ్గంపేట కాంగ్రెస్ ఇన్‌చార్జిని అడ్డుకున్న పోలీసులు

ఏజెన్సీలో పులి కలకలం!

రెండు మేకలను హతమార్చిందని అంటున్న గిరిజనులు
ప్రజలను అప్రమత్తం చేసిన అటవీశాఖ అధికారులు
పాదముద్రల ఆధారంగా గుర్తించే ప్రయత్నం


అధికారులు గుర్తించిన పాద ముద్రలు

రాజవొమ్మంగి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో చాలా రోజుల తరువాత పులి సంచరిస్తుందనే సమాచారం గిరిజన ప్రాంత ప్రజల్లో కలకలం రేపింది. మండలంలోని గడువకుర్తి పంచాయతిలో సోమవారం మేకల మందపై పులి దాడి చేసి రెండు మేకలను హతమార్చిందని గిరిజనులు చెపుతున్నారు. ఆ సమాచారం మేరకు సోమవారం రాత్రి, మంగళవారం అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని క్షుణంగా పరిశీలించారు. దోనెలపాలెం-గొబ్బిలమడుగు గ్రామాల మార్గమధ్యలో గండిపై పులి స్థావరంగా ఏర్పాటు చేసుకుని నిత్యం అక్కడే ఉంటుందని, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు అదే గండిపై కూర్చొని ఉందని ప్రజలు చెపుతున్నారు. మంగళవారం ఆ ప్రాంతాన్ని అటవీశాఖ రేంజ్ అధికారి ఉషారాణి సిబ్బందితో కలిసి పరిశీలించారు. పాదముద్రలను అధికారులు గుర్తించి కొలతలు తీసుకున్నారు. పులిని చూశామని చెపుతున్న వారి నుంచి అధికారులు వివరాలు సేకరించారు. ఉషారాణి మాట్లడుతూ అటవీ జంతువు ఈ ప్రాంతంలో తిరిగినట్టు పాదముద్రలు ఉన్నాయని, ఏ జంతువు అనేది వాటి పాదముద్రల ఆధారంగా గుర్తించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అవసరమైతే అనుమానాస్పద ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు పెడతామన్నారు. అలాగే గొబ్బిలమడుగు, లంగుపర్తి, దోనెలపాలెం సమీప గ్రామప్రజలు ప్రయాణాలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అయితే ఆ ప్రాంత ప్రజలు మాత్రం పులి సంచరిస్తుందనే విషయం తెలిసి భయభ్రాంతులకు గురవుతున్నారు.


పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

అపరాధ రుసుం లేకుండా రేపటి వరకూ ఇంటర్ ఫీజు గడువు

ఇంటర్మీడియట్ బోర్డు తూర్పుగోదావరి జిల్లా పర్యవేక్షణాధికారి నరసింహం

రాజమహేంద్రవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మార్చి-2025 ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అపరాధ రుసుం లేకుండా ఈనెల 5లోపు చెల్లించవచ్చని ఇంటర్మీడియట్ బోర్డు తూర్పుగోదావరి జిల్లా పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

రీఅడ్రస్ అర్జీల పరిశీలనకు ముగ్గురు అధికారులు

రెవెన్యూ అధికారుల సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రీఅడ్రస్ చేసిన అర్జీల పరిశీలనకు ముగ్గురు ప్రత్యేక అధికారులను నియమించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆమె సమీక్షించారు. ప్రజాసమస్యల పరిష్కార విధానంలో రీఅడ్రస్ చేసిన వాటి విషయంలో పారదర్శకంగా ఉండే విధంగా జిల్లాస్థాయిలో ముగ్గురు అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి అధికారుల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత మండలాల వారీగా భూసంబంధ అంశాల అర్జీలు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, ఏవో ఆలీ, పలువురు తహశీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం

జిల్లా నూతన కమిటీ ఎన్నిక


ప్రభుత్వ అధ్యాపకుల సంఘం నూతన కమిటీ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎండీ సాధిక్ మహ్మద్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొవ్వూరు), కార్యదర్శిగా కె.దుర్గారావు (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం), కోశాధికారిగా టి.నరసింహమూర్తి (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం), మహిళా కార్యదర్శిగా పి.శ్రీవల్లి (ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా నర్సారెడ్డి వ్యవహరించారు. అధ్యక్షుడు సాధిక్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బొమ్మల సరఫరాకు టెండర్లు ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 704 అంగన్వాడీ కేంద్రాలకు బొమ్మలు కొనుగోలు చేసి సరఫరా చేయడానికి దరఖాస్తులు కోరుతున్నామని ఐసీడీఎస్ పీడీ కే.విజయకుమారి తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రీ స్కూల్ ప్లే మెటీరియల్ కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ఆసక్తిగల సంస్థదారులు రూ.5 వేలు డీడీ తీసి టెండరుఫారాలతో ఈనెల 4నుంచి 12వ తేదీ సాయంత్రం ఐదుగంటల్లోపు దాఖలు చేయాలన్నారు. టెండర్లను 17వ తేదీ ఉదయం 11 గంటలకు జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో తెరువడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెం.95023 44806ను సంప్రదించాలన్నారు.

క్వారీ గోతుల్లో మరొక గుర్తుతెలియని మృతదేహం



రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 3(ఆంధ్ర జ్యోతి): క్వారీ గోతుల్లో మరో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. రాజమహేంద్రవరం 49వ డివిజన్ పరిధిలో ఉన్న క్వారీ గోతులు ప్రమాదకరంగా మారా యని సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇది జరిగి 24 గంటలు దాటక ముందే ఆ గోతుల్లో మరొక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే సుమారు 19 మంది 120 అడుగుల లోతు గోతుల్లో మునిగి మరణించారు. ఈ గోతులు పూడ్చాలని ఎప్పటి నుంచో ఉద్యమాలు జరుగుతున్నాయి. గతంలో హైకోర్టు కూడా క్వారీ గోతులను పూడ్చాలని ఆదేశించింది. అయినా నేటి వరకూ చర్యల్లేవ్.. అధికారులు స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బర్రే కొండబాబు స్పష్టం చేశారు.

నేడు ఘంటసాల జయంతి

ధవళేశ్వరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని బుధవారం ఇరిగేషన్ కార్యాలయం వద్ద పార్కులో ఉన్న ఆయన విగ్రహం వద్ద నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు జీవీ రమణ, యర్రమోతు ధర్మరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సంగీతాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

సీతానగరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో ఎం.భారతి ఆధ్వర్యంలో సాగునీటి సంఘాల ఎన్నికలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ మండలంలోని పురుషోత్తపట్నం చినకొండేపూడి, మునికూడలి, నాగంపల్లి, ఘుదేవపురంలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయన్నారు. సుమారుగా 14 వేల మంది రైతులు ఉన్నారని తెలిపారు. 2022నాటి నీటి పన్ను బకాయిల లేకుండా చెల్లించి ఉన్నవారు ఎన్నికల్లో పోటీ చేయవచ్చున్నారు. ఆయా గ్రామాల పాఠశాలల్లో ఈ నెల 8న ఎలక్షన్ ఉంటుందని ఉదయం 9 గం.ల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఈవో పీఆర్‌డీమూర్తి జలవనరులశాఖ ఏఈ శివ రామకృష్ణ కార్యదర్శులు డిజిల్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు

పీఎంపీలు తమ పరిధిలోనే ప్రథమ చికిత్సలు అందించాలి

కోరుకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ) సమావేశం కోరుకొండ మండలం బొల్లేద్దుపాలెం గ్రామంలో పీఎంపీల మండల అధ్యక్షుడు కుంచే వినోద్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పీఎంపీల రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పీఎంపీలు అందరూ వారి పరిధిలోనే ప్రాథమిక వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి దేవానందం, మండల కార్యదర్శి సూరిశెట్టి భాస్కర్,కోశాధికారి సీహెచ్ శివకుమార్, వై.పవన్‌కుమార్, జి.లాజర్,జి.నాని, బి.శ్రీనివాస్, పి. రామకృష్ణ, పి. సత్తిబాబు, బీవీఎస్ ప్రసాద్, గంగాధర్, జోగారావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేకవసరాల పిల్లలకు నైపుణ్య శిక్షణ

» జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ సుభాషిణి
» అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం
» పలుచోట్ల విద్యార్థులకు పోటీలు.. బహుమతుల ప్రదానం


దివాన్‌చెరువు సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీ సుభాషిణి

దివాన్‌చెరువు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్టు సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పలుచోట్ల మంగళవారం నిర్వహించారు. దివాన్‌చెరువులోని భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఏపీసీ సుభాషిణి విచ్చేసి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయాలని సూచించారు. అలాగే పిల్లల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో భవిత కేంద్రాలకు వచ్చే 1600 మంది పిల్లలకు నాలుగురకాల అలవెన్సుల కింద రూ.23 లక్షలు విడుదల చేశామన్నారు. దివాన్‌చెరువులోని భవిత కేంద్రానికి వస్తున్న 20 మంది పిల్లల్లో 14 మంది రాజానగరం నుంచే వస్తున్నారన్నారు. ఆ పిల్లల తల్లిదండ్రుల కోరిక మేరకు భవిత కేంద్రాన్ని రాజానగరంలోని ఉన్నత పాఠశాలలో ప్రారంభించేందుకు అనుమతిచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలోని పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఝాన్సీ, ఏఎంవో గౌరీ శంకర్, సీఎంవో శ్రీనివాస్, రాజానగరం ఎంఈవోలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని నెం-2 పాఠశాలలోని భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. దివ్యాంగులకు సరైన ప్రోత్సాహం అందిస్తే ఉన్నత స్థానాలకు ఎదుగుతారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

కడియం: మండలంలోని మురమండలో జరిగిన దివ్యాంగుల దినోత్సవానికి కాకినాడ డివిజన్ అధ్యక్షుడు మేడపాటి పాపిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అయినవిల్లి వేంకటేశ్వరరావు దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుజ్జిరావు, వెంకటరమణ, దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు ఆకెళ్ల రవి, రామచంద్ర శశిధర్, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాష్‌బాబు, ఎస్ఐ క్రాంతికుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. మనో బలంతో దివ్యాంగులు తాము అనుకున్నది సాధించాలని ఆకాంక్షించారు. పిల్లల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ ఎ.వెంకటేశ్వరరావు, పి.లక్ష్మీసంతోషి, నాగమణి, ఐఆర్‌టీ టీచర్లు, విద్యార్థులతల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిక్కవోలు: స్థానిక భవిత కేంద్రంలో జరిగిన దివ్యాంగుల దినోత్సవంలో ఎంఈవో-1 సీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రతి సోమవారం ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారని, హోమ్ బేసెడ్, ఎస్కార్ట్ అలవెన్స్ 85 మంది విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. దివ్యాంగులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాస్ అన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంఈవో-2 పూర్ణచంద్రరావు, ఐఈఆర్‌టీ డి.సన్యాసిరావు, జేఈడీ టీచర్ కె.శివబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి సమావేశానికి జిల్లా సమగ్ర శిక్ష అకాడమిక్ మోనిటరింగ్ అధికారి గౌరీశంకర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సీఎంవో శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగుల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి. మధుసూధనరావు, ఐఈఆర్టీలు ఎంవీఎస్ ప్రసాద్, అంజలీ, హెచ్‌ఎం వి.పార్థసారథి, పంచాయతీ కార్యదర్శి వి.శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు మధుపణి పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన దివ్యాంగుల దినోత్సవంలో ప్రిన్సిపాల్ చిట్టిబాబు మాట్లాడుతూ దివ్యాంగులను రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సహించేలా అందరూ మెలగాలన్నారు. కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు పండ్లు, స్వీట్లు అందించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

రాజమహేంద్రవరం సిటీ/కల్చరల్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పలువురు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాజమహేంద్రవరం గౌతమి జీవకారుణ్య సంఘంలో వృద్ధులు, మునిసిపల్ కాలనీ ప్రియదర్శిని చెవిటి మూగ పాఠశాలలో, ధవళేశ్వరం పలుకు ఆశ్రమం భాష్యం విద్యాసంస్థల ప్రోత్సాహంతో ఆ విద్యార్థులు థ్యాంక్స్ గివింగ్ డే నిర్వహించారు. అనాథలకు పండ్లు, బిస్కెట్లు, దుప్పట్లు, టవల్స్ తదితర సామగ్రి అందజేశారు. అమ్మ ఆర్థోపెడిక్ అండ్ రిహాబిలిటేషన్ హాస్పిటల్‌లో వికలాంగులైన చిన్న పిల్లలకు డాక్టర్ గిరిజాల సోమరాజు నాయుడు ఉచిత వైద్య సేవలందించారు. కార్యక్రమాల్లో జీఈవో వరలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



రంగంపేటలో బహుమతుల ప్రదానం


రాజమహేంద్రవరంలో దివ్యాంగుల దినోత్సవం



ధవళేశ్వరంలో దివ్యాంగుల దినోత్సవం

రామాలయ నిర్మాణానికి విరాళం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక చందాసత్రం సమీపంలోని కోదండ రామాలయం పునఃనిర్మాణానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.లక్ష పైబడి విలువైన ఐరెన్ మంగళవారం ఆలయ కమిటీకి అందించారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యిన్నమూరి దీపు, మండవిల్లి శివ, నాయకులు వెంకన్న, జయరామ్, సత్తిబాబు పాల్గొన్నారు.

ఆలిండియా కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఇటీవల జరిగిన ఆలిండియా నేషనల్ కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఫెడరేషన్ కప్ ప్రీమియర్ లీగ్ అండ్ యూత్ లీగ్ పోటీల్లో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం విద్యార్థులు పలు పతకాలు సాధించారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు చెందిన పి.విజయ్ సిల్వర్ మెడల్, లాస్లేట్ స్కూల్ విద్యార్థి కె.జాక్సన్, ధవళేశ్వరం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎం.నవ్యశ్రీ, లాలాచెరువు మునిసిపల్ స్కూల్ విద్యార్థి పి.సత్యవెంకట శ్రీరామ్, సునంద స్కూల్ విద్యార్థినులు పి.పూజ, కె.లక్ష్మీ భవాని, వి.వెంకట కిరణ్మయి బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ మేరకు విద్యార్థులకు కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు భరత్ శర్మ, మాస్టర్ పిల్లి అరుణ్ కుమార్ అభినందనలు తెలిపారు.

75 లీటర్ల సారా స్వాధీనం

రంగంపేట, డిశంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిశలేరులో మంగళవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 75 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 600 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. గ్రామానికి చెందిన కొండేటి నల్లమ్మ, రాజానగరం మండలం రఘునాథపురానికి చెందిన బొల్లేపల్లి వీరబాబులపై కేసు నమోదు చేశామని చెప్పారు.

రెండు ఆసుపత్రుల్లో టిఫా స్కానింగ్ ఉచితం

ఎంపీహెచ్ఈవో వెంకటరమణ

పీసీపీఎన్‌డీటీ యాక్టుపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని డీఎంహెచ్‌వో కార్యాలయ సెక్షన్ ఎంపీహెచ్ఈవో టి.వెంకటరమణ అన్నారు. రాజమహేంద్రవరం కంబాలపేట పట్టణ ఆరోగ్యకేంద్రంలో సిటీ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలకు పీసీపీఎన్‌డీటీ యాక్టుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆడపిల్లల సమతుల్యత, టిఫా స్కానింగ్ ప్రాముఖ్యతను వివరించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణకు ప్రయత్నిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. టిఫా స్కానింగ్ వల్ల గర్భస్థ శిశువులకు ఉన్న లోపాలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. గోకవరం బస్టాండు వద్ద ఉన్న రాయల్ హాస్పటల్, జీఎస్ఎల్ ఆసుపత్రుల్లో మాత్రమే ఈ టిఫా స్కానింగ్ పరీక్షలు ఉచితం అందుబాటులో ఉన్నాయన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం డిప్యూటీ డెమో డాక్టర్ ఎన్.సత్యకుమార్ పలు సూచనలు చేశారు. ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్, పట్టణ ఆరోగ్యకేంద్రాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఐఏడీఎల్‌వీఎల్ సదస్సులో జీఎస్‌ఎల్‌కు ఆరు అవార్డులు

● డాక్టర్ గన్ని సాధిక సమర్పించిన సైంటిఫిక్ పేపరుకు ప్రథమ బహుమతి


డాక్టర్ గన్ని సాధికను అభినందిస్తున్న జీఎస్ఎల్ సంస్థల చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ గుంటూరులో నిర్వహించిన ఐఏడీఎల్‌వీఎల్ రెండు రోజుల సదస్సులో తమ కళాశాలకు ఆరు అవార్డులు లభించినట్లు జీఎస్‌ఎల్ సంస్థల చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. ఈసందర్భంగా జీఎస్‌ఎల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల డెర్మటాలజీ విభాగం మొత్తంగా ఆరు అవార్డులు సాధించిందన్నారు. తీవ్రతరమైన బొల్లి వ్యాధిగ్రస్తులకు మెటబాలిక్ సిండ్రోమ్‌ను తొలిదశలోనే స్క్రీనింగ్ చేయాల్సిన ప్రాముఖ్యతపై డాక్టర్ గన్ని సాధిక, డాక్టర్ బత్తిన నవ్య ప్రచురించిన సైంటిఫిక్ పేపర్‌కు ఐఏడీవీఎల్(ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్ వెనీరియాలజిస్ట్స్ అండ్ లెప్రాలజిస్ట్స్)సోయాసిస్‌పై విస్తృత పరిశోధన పత్రం సమర్పించిన డాక్టర్ గన్ని సాధికకు ప్రథమ అవార్డు అందుకున్నారు. మందులతో తగ్గని బొల్లి వ్యాధికి సున్నితమైన సర్జరీ ద్వారా మచ్చలు తగ్గించవచ్చన్న డాక్టర్ ధృతిచుగ్ దీసిస్‌కు ఉత్తమ థీసిస్ అవార్డు లభించింది. ఈ బృందాన్ని డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాధ్ తదితరులు అభినందించారు.

బీసీలను మోసం చేసిన జగన్

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి

రాజమహేంద్రవరంరూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి బీసీలను మోసంచేశారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీల అభ్యున్నతికి బాటలు వేశారని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. రూరల్ మండలం కాతేరు పంచాయతీ పరిధిలోని శ్రీదేవినగర్ నాయీ బ్రాహ్మణ కాలనీని మంగళవారం సందర్శించారు. విజయదుర్గ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ 50కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని వాటికి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా వీటికి సంబంధించిన నిధులు నవరత్నాలకు మళ్లించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, ధాన్యం ప్రసాద్, కందికొండ అనంత్, అజంగి దేముడు, కోటిపల్లి చంద్రశేఖర్, పెండ్యాల నాగబాబు, గోరింట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి


బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లను సత్కరించిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట, డిసెంబరు 3 : (ఆంధ్రజ్యోతి)ః భారతీయ జనతా పార్టీ బలోపేతానికి తమవంతు కృషిచేయాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామంలో బీజేపీ బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్‌కమిటీ సభ్యుల నియమాకం జరిగింది. 138 బూత్ అధ్యక్షులుగా, పంజా దుర్గారావు బూత్ అధ్యక్షుడిగా పులిమి ప్రసాద్, 140 బూత్ అధ్యక్షుడిగా తోట సూర్యచక్రం, 141 బూత్ అధ్యక్షుడిగా ఉద్దండ్రావు శివలను నియమించారు. వీరిని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రజని, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు గుప్తా, సూర్యభాస్కరరావు, మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.సాయిరాం, కె.నాని, మండల, గ్రామ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

● రామకృష్ణ మఠం ప్రతినిధి స్వామీ సేవ్యానందజీ మహరాజ్


వ్యక్తిత్వ వికాస సదస్సు ముగింపు సభలో ప్రసంగిస్తున్న స్వామి సేవ్యానందజీ మహరాజ్

అనపర్తి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినపుడే ఏదైనా సాధించగలుగుతారని రాజమహేంద్రవరం రామకృష్ణమఠం ప్రతినిధి స్వామీసేవ్యానందజీ మహరాజ్ అన్నారు. అనపర్తిలోని జీబీఆర్ విద్యా సంస్థల సెమినార్ హాల్‌లో వ్యక్తిత్వ వికాస సదస్సు 2024 కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో స్వామీజీ ప్రసంగిస్తూ యువతలో ఉన్న శక్తి సామర్థ్యాలను దేశప్రగతికి వినియోగించేలా వారిని కార్యోన్ముఖులను చేయాలన్నారు. కడప రామకృష్ణ మఠం ప్రతినిధి స్వామి సన్నివాసానందజీ మహరాజ్ ప్రసంగిస్తూ విద్యార్థులలో ఉన్నతమైన ఆలోచనలు నింపడం ద్వారా వివేకానందుడి బోధనలు వారికి చేరువవుతాయన్నారు. రెండోరోజు జరిగిన సదస్సులో 300మంది విద్యార్థులు పాల్గొన్నారు. సమితి ఉపాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, వైసీపీ నాయకులు సత్తి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రూత్ వివేకామృత ఆధ్యాత్మిక విజయోత్సవ వేడుక

బిక్కవోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జీవాత్మ పరమాత్మల కళ్యాణ కారకమైనది ఆత్మజ్ఞానమని ట్రూత్ స్పిరిట్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు శ్రీవివేకానంద సూచించారు. బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ట్రూత్ వివేకామృత ఆధ్యాత్మిక విజయోత్సవ వేడుకలు మంగళవారం నాల్గవరోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా ఆయన ఓంకారం అసలైన అంతరార్థాన్ని తెలుసుకుని ప్రణవ ఉపాసన చేసినప్పుడే సాధకుడు ఏకత్వం అనే స్థితికి చేరుకుంటారని ప్రబోధించారు. ఈకార్యక్రమంలో ముంబయి, తెలంగాణా, మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో సాధకులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

గోకవరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు ఆచరణీయమని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. స్థానిక గోపీకృష్ణ ఫంక్షన్ హాల్లో సోమవారం రాత్రి నిర్వహించిన మండల క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగాడ నవీన్ చేతుల మీదుగా క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి ప్రతీ ఒక్కరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రైస్తవ బోధనలు అలవర్చుకోవడం ద్వారా శాంతి మార్గాన పయనించవచ్చన్నారు. ప్రశాంతి కుమార్ హాలోనెన్ మాట్లాడుతూ గతంలో జరిగిన నియోజకవర్గ ఐక్య క్రిస్మస్ వేడుకల్లో సుమారు 300 మంది దైవజనులు ప్రస్తుత ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోసం అప్పట్లో ప్రార్థనలు చేశారన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో ఇమామి ఖాసిం

రాజానగరం, డిసెంబరు 3 : రైతు సోదరులంతా ఈ-పంట విధిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం పిలుపునిచ్చారు. మండలంలో కలవచర్ల, సీతారాంపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా తాము సాగు చేసుకునే వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలకు విధిగా పంట బీమా చేయించుకోవాలని సూచించారు. వరి పంటకు ఎకరాలకు రూ.630 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉం దన్నారు. మొక్కజొన్న పంటకు ఎకరాలకు రూ.540 లు, మినుము, పెసర పంటలకు ఎకరాకు రూ.300 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, ఈనెల 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దివ్యాంగులు రాణించాలి: యనమల

రాజమహేంద్రవరం కల్చరల్‌నవంబర్3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర అధ్యక్షుడు యనమల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద అఖిల భారత దివ్యాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో మాట్లాడారు. దివ్యాంగులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు యర్రా ఉమా మహేశ్వరి,జిల్లా అధ్యక్షుడు అంకం గంగరాజు,సంఘం అధికార ప్రతినిధి గుత్తుల ఉమాదేవి, కర్రి మౌళి,యేడిద వెంకటరమణ,చిక్కాల వినోద్‌కుమార్, కొప్పిశెట్టి వరలక్ష్మి,కొక్కిరమట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

మండల సమావేశం

కడియం, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి) ఈనెల 5న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో మంగళవారం జరిగిన కడియం మండల పరిషత్ సమావేశం కేవలం 5నిముషాల్లో ముగిసింది. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో కె.రమేష్ మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ చేపట్టడం లేదని సభను ముగించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కలిదిండి విశాలాక్షి, పంతం గణపతి, సర్పంచ్‌లు, ఎంపీ టీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

● ఎంపీ పురందేశ్వరికి విన్నపం

కడియం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కడియం ఆవరైతుల సమస్యలను రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కడియం బీజేపీ నాయకులు చిక్కాల ఈశ్వరరావు, గారపాటి తాతబ్బాయి, చిక్కాల శ్రీను, సిహెచ్ రామచంద్రరావు, మంచెం దుర్గారావులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడు తూ కడియం ఆవ రైతులకు సంబంధించి ఆవలో పంచాయతీరాజ్ వేయించిన పైపులు పనిచేయక రైతులు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు 3 షెడ్‌లు వేసి 6 మంచినీటి పైపులు వేయించారన్నారు. మంచినీటి పైపులు ప్రస్తుతం పనిచేయడం లేదన్నారు. కడియం ఆవలో చెక్‌డామ్‌లు కట్టాలని, పాడైన లాకునకు మరమ్మతులు చేయించాలని కోరారు. గ్రామంలో బొబ్బిలివంతెన నిర్మాణం చేయించాలని కోరారు. ఈ సందర్భంగా లిఖితపూర్వకంగా రైతుల సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

రాజానగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5వ తేదీన జరుగనున్న ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రాజానగరం నియోజకవర్గం వ్యాప్తంగా 215మంది ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఆరోజు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటు హక్కును వినియోగించు కోనున్నారు.

బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి

బిక్కవోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొంకుదురు ఉన్నత పాఠశాలలో మంగళవారం భారతదేశ మొట్టమొదటి రాష్ట్రపతి డా. బాబూరాజేంద్రప్రసాద్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతిగా సామాన్య ప్రజల సంక్షేమానికి ఎంతగానో కృషి చేసారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని అందించిందన్నారు.

మద్యం షాపులు బంద్

అమలాపురం టౌన్/యానాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో మద్యం షాపులు, బార్లు మూసి వేయాలని జిల్లా ఎన్నికల అధికారి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి గురువారం సాయంత్రం 4 గంటల వరకు మద్యం డిపోలు, దుకాణాలు, బార్‌లు మూసి ఉంచాలన్నారు. రెండు రోజుల పాటు యానాంలో మద్యం షాపులు మూసివేయనున్నట్టు పుదుచ్చేరి డిప్యూటీ ఎక్సయిజ్ కమిషనర్ తెలిపారు.

రేపు టీచర్స్ ఎమ్మెల్సీ పోరు

- ఉదయం 8 నుంచి పోలింగ్ - 16,737 మంది ఓటర్లు - 9న కౌంటింగ్


బి.గోపిమూర్తి


జి.నారాయణరావు


కె.నాగేశ్వరరావు


పులుగు దీపక్


ఎస్.వెంకటలక్ష్మి

కలెక్టరేట్ (కాకినాడ)/ రాజమహేంద్రవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ నియోజకవర్గం శాసనమండలి(ఎమ్మెల్సీ) ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది.గత ఎన్నికల్లో యూటీఎఫ్ తరపున గెలిచిన షేక్ సాబ్జి రోడ్డు ప్రమా దంలో మృతిచెందడంతో ఈ ఉప ఎన్నిక అని వార్యమైంది.ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 8 నుంచి సాయం త్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ నిర్వ హిస్తారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరగ ను న్నాయి. ఐదుగురు అభ్యర్థులు స్వతంత్రంగా బరిలో ఉం డడంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. యూటీఎఫ్ నేత బొర్రా గోపీమూర్తి, గంధం నారా యణ రావు,డా.కవల నాగేశ్వరరావు,పులుగు దీపక్, నామన వెంకట లక్ష్మి(విళ్ల లక్ష్మి) పోటీ పడుతు న్నారు. ప్రధాన పోటీ ఇద్దరి మధ్యే ఉంటుందని పరిశీలకులు అంచనా. ఇంత వరకూ హోరా హోరీగా సాగిన ప్రచారం మంగళవారం సాయంత్రం 4 గంటలతో ముగిసింది. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.16,737 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కాకినాడ జిల్లాలో 3418 మంది,తూర్పుగోదావరి జిల్లాలో 2990, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3296, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 637, పశ్చిమగోదావరి జిల్లాలో 3729,ఏలూరు జిల్లాలో 2667 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను సురక్షి తంగా కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించనున్నారు.ఈనెల 9వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తారు. ఈ నెల 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగు స్తుంది. ఎన్నికల్లో విధులు నిర్వహించేందుకు పీవోలు, ఏపీవోలు,ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు,సెక్టార్ అధికారులు, ఇతర సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.ఈ నేపథ్యంలో బుధ, గురువారాలు 144 సెక్షన్ అమల్లోకి తెచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు డీఆర్వో సీతారామమూర్తి తెలిపారు.ఆర్ట్స్ కళాశాల వద్ద పోలింగ్ సామగ్రి అందిస్తామన్నారు.

ఎన్నిక ప్రశాంతంగా జరగాలి

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నిక స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో అన్ని మండలాల తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భారత ఎన్నికల సంఘం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఓటు వేసేందుకు క్యాజువల్ లీవ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఈ నియోజకవర్గ ఉపాధ్యాయ ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు యాజమాన్యాలు తగు వెసులుబాటు కల్పిస్తూ విధులకు ఒక గంట ఆలస్యంగా హాజరయ్యేందుకు, షిఫ్టుల అడ్జస్ట్‌మెంటు అనుమతించాలన్నారు.

వేమగిరి పంచాయతీలో విచారణ

డిప్యూటీ సీఎం పవన్‌కు ఫిర్యాదు..కదులుతోన్న డొంక

రాజమహేంద్రవరంరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : వేమగిరి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం కొవ్వూరు డీఎల్‌పీవో విచారణ చేపట్టారు.కడియం మండలం వేమగిరి గ్రామంలో నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ అదే గ్రామానికి చెందిన కె.సత్యనారాయణ ఈ ఏడాది జూలై 10వ తేదీన నేరుగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.2022లో అప్పటి గ్రామ కార్యదర్శి కే.రాజశేఖర్, డిప్యూటేషన్‌పై వచ్చిన బిల్ కలెక్టర్ కె.శ్రీనివాస్ లక్షలాది రూపాయలు నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్లాన్ అప్రూవల్‌కు రూ.10వేలు, ఇంటికి తక్కువ పన్నులు వేస్తామంటూ ఒక్కొక్క ఇంటికి రూ.5 వేలు, శానిటేషన్ తదితర పనులకు ఉపయోగించే దినసరి కార్మికులు ఒక్కొక్కరు నుంచి రూ.100, డ్రైనేజీ, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు నాసిరకంగా చేస్తూ బిల్లులు చేయించుకున్నారని ఆరోపించారు. గ్రామంలో అవినీతిపై ఎంపీడీవో, డీఎల్‌పీవో, డీపీవోలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.ఈ మేరకు మంగళవారం విచారణ చేపట్టారు. వేమగిరి గ్రామానికి అప్పటి ఎంపీడీవో కె.రత్నకుమారి ప్రత్యేకాధికారిగా ఉన్నారు. అయితే ఎటువంటి ఖర్చయినా ప్రత్యేకాధికారి తంబ్ వేస్తేనే బిల్లులు అవుతాయి.ఈ అవినీతిలో ఎవరిపై చర్యలు ఉంటాయో వేచి చూడాల్సిందే. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేమగిరి గ్రామానికి ప్రత్యేకాధికారిగా రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ బాధ్యతలు చేపట్టారు. పాత పద్ధతినే సదరు కార్యదర్శి రాజశేఖర్ ఇష్టానుసారంగా లక్షలాది రూపాయల బిల్లులు పెట్టడంతో కేతన్‌గార్గ్ అనుమానం వ్యక్తం చేశారు.దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదించగా.. జిల్లాస్థాయి అధికారిణి విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలంటూ కలెక్టర్ ఆదేశాలిచ్చినట్టు తెలిసింది.

సాహసం సాగరం



నావికాదళ విన్యాసాలకు కేంద్రంగా కాకినాడ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ సాగరం రక్షణపరంగా తూర్పు నావికా దళానికి అత్యంత కీలకం. గడచిన కొన్నేళ్లుగా కాకినాడ సముద్ర జలాల్లో ఇండియన్ నేవీ పలు రకాల మాక్‌డ్రిల్స్, ఎక్సర్‌సైజ్‌లతో భద్రతను పటిష్టం చేస్తోంది. ఈ మేరకు అమెరికన్ నేవీతో సైతం పలు రకాల ప్రత్యేక ఉమ్మడి విన్యాసాలు చేస్తూ తీరాన్ని, సముద్రజలాల సరిహద్దును కంటికి రెప్పలా కాపాడుతోంది. వాస్తవానికి నావికాదళం అంటే విశాఖలోని తూర్పునావికాదళ స్థావరంగా చెబుతారు.దీని పరిధిలో కాకినాడ సాగరం కూడా ఉండడంతో గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో వ్యూహాత్మక రక్షణ చర్యలు చేపడుతోంది. నేడు భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రతి ఏడాది విన్యాసాలు..

2022 అక్టోబరులో భారత నేవీ ఆఫ్‌షోర్ సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్‌ను ప్రస్థాన్ పేరుతో నిర్వహించింది. నౌకల్లోకి నేవీ విమానాలు ఎగురుకుంటూ వచ్చి భద్రత చర్యలు చేపట్టడం, బాంబులు పసిగట్టడం వంటి వాటిపైనా, నిపుణులను రక్షించి తీసుకువెళ్లడంపై మాక్‌డ్రిల్ నిర్వహించింది.2023 జనవరిలో ఆర్మీ,నేవీ,ఎయిర్‌ఫోర్స్ కలిపి కాకినాడలో యాంపెక్స్-2023 నిర్వహించాయి. తీరంలోను సముద్రంలోపల విదేశీ శక్తులు, ఉగ్రవాదులు చొరబడితే వారిని మట్టుపెట్టడం ఎలా? రక్షణ విషయంలో ఎలా చురుగ్గా వ్యవహరించాలి? వ్యూహాల అమలు..వంటివాటిపై ఎక్సర్‌సైజ్ చేపట్టాయి. 2023 ఏప్రిల్‌లో సముద్రంలో చమురు కార్యకలాపాల వల్ల సాగర జలాలు కాలుష్యం నేపథ్యంలో వాటిని ఎలా సంరక్షించుకోవాలి? సముద్రంలో బోట్లు, షిప్పుల్లో జరిగే అగ్నిప్రమాదాల సమయంలో ఆస్తినష్టం తగ్గించుకుంటూ అందులో ఉన్న వారిని కాపాడుకోవడం ఎలా? అనే దానిపై నేవీ విన్యాసాలు నిర్వహించింది. నౌకల్లోంచి నేవీ సిబ్బంది ప్రమాద ఘటనలో ఇతర నౌకల్లో మంటలను అదుపు చేయడం, అందులోని సిబ్బందిని ప్రత్యేక బాక్సుల్లో ఈదుకుంటూ వెళ్లి రక్షించడం, హెలీకాప్టర్ల నుంచి తాడుతో దిగి వారిని కాపాడడం వంటి వాటిని సాహసోపేతంగా చేసి చూపించింది. అదే ఏడాది అక్టోబరులో చమురుసంస్థలు, కోస్ట్‌గార్డ్,కస్టమ్స్ తో కలిపి రక్షణ చర్యలు చేసి చూపించింది. నేవీకి చెందిన ఐఎన్ ఎస్ కోర,ఐఎన్ఎస్ టిహోయులు మెరైన్ కమాండోలతో కలిపి బాంబు డిస్పోజబుల్ నిపుణులు ప్రమాదాల సమయంలో ఏవిధంగా దేశ తీరజలాలను కాపాడుకోవాలో చేసి చూపించాయి.ఈ ఏడాది సెప్టెంబరులో కాకినాడలో తూర్పు నావికాదళం 47వ ప్రాంతీయ సదస్సు ఇక్కడే నిర్వహించింది. ఏటా అమెరికన్ నేవీతో కలిసి విన్యాసాలు చేస్తూ కాకినాడ తీరం,సముద్ర జలాల సరిహద్దుల్లో గస్తీ పెంచి విశేష సేవలందిస్తోంది.

దేశానికి ఆయువుపట్టు కేజీ బేసిన్

ప్రధానంగా కాకినాడ తీరం నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేజీ బేసిన్ దేశానికి అతిపెద్ద ఆయువు పట్టు. సముద్రం మధ్యలో 50 వేల చదరపు కిలో మీటర్లకుపైగా విస్తరించి ఉన్న బేసిన్‌లో 2003 నుంచి 26 బావుల్లో చమురు,గ్యాస్‌ను ఓఎన్‌జీసీ, రిలయన్స్, కెయిన్ ఎనర్జీ వంటి ప్రఖ్యాత కంపెనీలు తవ్వుతున్నాయి. లక్షల కోట్ల పెట్టుబడులతో వందలాది మంది నిపుణులు, సిబ్బంది.. పదుల సంఖ్యలో నౌకల్లో ఉంటూ ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీని రక్షణ భారత తూర్పు నావికాదళం పర్యవేక్షిస్తోంది. కేజీ బేసిన్‌లో అకస్మాత్తుగా అగ్నిప్రమాదాలు జరిగినా, విద్రోహశక్తులు కన్నేసినా దీన్ని ఎలా రక్షించుకోవాలి? అనేదానిపై ప్రతి ఏటా ప్రత్యేక మాక్‌డ్రిల్ నిర్వహిస్తోంది. వచ్చే ఏడాది మార్చిలో అమెరికన్ నేవీతో కలిసి ఈసారి విన్యాసాలు చేసేందుకు మన ఇండియన్ నేవీ అధికారులు సన్నద్ధమవుతున్నారు.


విమాన విన్యాసాలు

- కేజీ బేసిన్‌లో చమురు,గ్యాస్
- లక్షల కోట్లతో నిక్షేపాలకు అన్వేషణ
- కీలకంగా మారిన భద్రత
- ఎప్పటికప్పుడు నేవీ నిఘా
- ప్రతి ఏటా ప్రస్థాన్ పేరిట మాక్‌డ్రిల్
- రక్షణ చర్యలపై అవగాహన
- వచ్చే ఏడాది మార్చిలో విన్యాసాలు
- నేడు భారత నౌకాదళ దినోత్సవం

సిద్ధమైతే.. అద్భుతమే!

సర్పవరం జంక్షన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందిన కాకినాడ బీచ్‌లో ఏర్పాటు చేసిన యుద్ధ విమాన మ్యూజియం త్వరలో సందర్శకులకు వినోదం, విజ్ఞానం అందించనుంది. దేశ భద్రత,రక్షణ కోసం త్రివిధ దళాలు అందిస్తున్న సేవలు, రక్షణ రంగంలో టీయూ-142 ఎం యుద్ధ విమానం అందించిన సేవలను మ్యూజియం రూపంలో థీమ్‌పార్కు పేరిట కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్‌లో 2020లో రూ.5.89 కోట్ల గుడా నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రెండెకరాల స్థలంలో టీయూ-142 విమాన మ్యూజియం నిర్మాణం పనుల టెండర్‌ని తెనేజా ఏరో స్పేస్ లిమిటెడ్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ఇంకా యుద్ధ విమానం లోపల ఏసీ, విద్యుద్దీకరణ, లైటింగ్ పనులు పూర్తి కావాల్సి ఉంది. ఆయుధాల నిల్వ, వాటిని ఏవిధంగా ప్రయోగిస్తారు, విమాన టేకాఫ్, ల్యాండింగ్ తదితర వివరాలు, దేశానికి అందించిన సేవలు, డిస్‌ప్లే, వీడియో, ఆడియో తదితర సమాచార వ్యవస్థ, గేమింగ్ జోన్, విజ్ఞానంపై సమాచారం ఏర్పాటు చేయాల్సి ఉంది.

కాకినాడలో సిద్ధమవుతున్న యుద్ధ విమాన మ్యూజియం



కాకినాడలో టీయూ-142ఎం యుద్ధ విమాన మ్యూజియం

మ్యూజియంలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి పరిశీలిస్తే మరింత సమయం పట్టే అవకాశం ఉంది. కానీ ఇవన్నీ పూర్తయితే మ్యూజి యం సందర్శకులకు కనువిందు చేయనుంది. ఇది ఎప్పుడు పూర్తవుతుందా అని జనం ఎదురుచూస్తున్నారు.

యుద్ధ విమానం ప్రత్యేకతలివే..

టీయూ-142 యుద్ధ విమానాన్ని రష్యా దేశం నుంచి కొనుగోలు చేశారు. కార్గిల్ యుద్ధంలో ఇది విశేష సేవలు అందించింది. ఒక్కసారి ఫ్యూయల్ నింపుకుని ప్రపంచదేశాలను కేవలం 16 గంటల్లో చుట్టివచ్చే సామర్థ్యం దీని సొంతం. ఇది గంటకు 925 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. విమానం పొడవు, వెడల్పులు 50 మీటర్లు, రెక్కల పొడవు 50 మీటర్లు .దీని బరువు 90 వేల కిలోలు. ప్రపంచంలోనే అతి భారీ, పురాతన యుద్ధ విమానాల్లో ఒకటైన టీయూ-142ఎం ఎయిర్‌క్రాఫ్ట్ భారత నావికాదళం వైమానిక విభాగంలో 28 ఏళ్లపాటు దేశానికి విశేష సేవలు అందించింది. సముద్ర తీర గస్తీ, జలాంతర్గామి నిరోధక సేవలు అందించడంలో ఖ్యాతి గడించిన ఈ యుద్ధ విమానం 2017లో నేవీ నుంచి వైదొలిగి, తమిళనాడులోని అరక్కోణం బేసల్ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ రాజసంలో విశ్రాంతి తీసుకుంటుంది. ఈ విమానాన్ని తమిళనాడు నుంచి కాకినాడ బీచ్‌కు 14 భారీ వాహనాల ద్వారా తెనేజా ఏరో స్పేస్ లిమిడెట్ సంస్థ తీసుకువచ్చింది.


కోరుకొండలో కోతకు వచ్చిన పంట


కోరుకొండలో ధాన్యపు రాశిని పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ మేనేజర్ రాధిక

చివరికిలా!

- వీడని తుఫాన్ భయం
- కోతలకు రైతులు దూరం
- కోరుకొండలో లబోదిబో
- 90 శాతం పంట చేలోనే

కోరుకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టం చేతికి వచ్చే సమయంలో ముందు నుయ్యి, వెనక గొయ్యి అన్న చందంగా రైతన్నల పరిస్థితి మారింది. కోరుకొండ మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం 90 శాతం వరకు కోతకు వచ్చింది. ఈ దశలో తుఫాన్ హెచ్చరికలు రావడంతో గత ఐదు రోజులుగా రైతులు వరికోతలను ఆపివేశారు. వాతావరణం మబ్బులు పెట్టి చిరుజల్లులు పడుతుండడంతో రైతాంగం భయపడుతున్నారు. మండలంలో చాలా తక్కువ మంది రైతులు మాత్రమే వరి కుప్పలు వేశారు. ఎక్కువ శాతం వరిపైరు దశలో ఉంది. కోరుకొండ మండలంలో లోతట్టు గ్రామాలైన కోటి, శ్రీరంగపట్నం, రాఘవాపురం, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, మునగాల,బుచ్చింపేట గ్రామాల్లో ముమ్మరంగా వరికోతలకు రైతులు సిద్ధపడ్డారు.అయితే అధికారుల నుంచి వస్తున్న తుఫాన్ హెచ్చరికతో కోతలకు దూరంగా ఉన్నారు. మరికొన్ని రోజులు ఆగితే ధాన్యం రెల్ల విరిగి నేలపాలై దిగుబడి తగ్గిపోతుందని కోరుకొండ, జంబూపట్నం,నర్సాపురం,గాదరాడ,గోనగూడెం, బూరుగుపూడి, దోసకాయపల్లి గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు.ఈ నేపథ్యంలో రైతులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు.తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బహిరంగంగా ధాన్యం ఆరబెట్టొద్దు

పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాధిక

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆరుబయట ధాన్యం నిల్వలు పెట్టవద్దని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాధికా సూచించారు. కోరుకొండ మండల పరిధిలో మంగళవారం ఆమె పర్యటించారు. ధాన్యం కోతలు నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో ఆరబెట్టిన ధాన్యపు నిల్వలు పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కోరుకొండ మండలం రాఘవపురం, బొల్లేద్దుపాలెం, పశ్చిమగోనగూడెం గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు.

రీఅడ్రస్ అర్జీల పరిశీలనకు ముగ్గురు అధికారులు

రెవెన్యూ అధికారుల సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రీఅడ్రస్ చేసిన అర్జీల పరిశీలనకు ముగ్గురు ప్రత్యేక అధికారులను నియమించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆమె సమీక్షించారు. ప్రజాసమస్యల పరిష్కార విధానంలో రీఅడ్రస్ చేసిన వాటి విషయంలో పారదర్శకంగా ఉండే విధంగా జిల్లాస్థాయిలో ముగ్గురు అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి అధికారుల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత మండలాల వారీగా భూసంబంధ అంశాల అర్జీలు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, ఏవో ఆలీ, పలువురు తహశీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి

సీపీఐ ఎంఎల్, పీవోడబ్ల్యు, పౌరహక్కుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా



కొవ్వూరులో నిరసన ధర్నా చేస్తున్న నాయకులు

కొవ్వూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఉచిత విద్యుత్ అందించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, పీవోడబ్ల్యు, పౌరహక్కుల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ మేరకు కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజీకి వినతిపత్రాన్ని అందజేశారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ అధిక ధరలతో సామాన్యులు కొట్టుమిట్టాడుతుంటే విద్యుత్ చార్జీలను పెంచడం దుర్మార్గమన్నారు. అకాల వర్షాలతో రైతులు పంట పొలాలు దెబ్బతిన్నాయని, వారికి పంట నష్ట పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకుడు పి.నాగేశ్వరరావు, పీవోడబ్ల్యు నాయకురాలు ఈ.మల్లిక, సాయి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చెరువును రద్దు చేస్తామనడం సరికాదు

» రజకజన సంఘ జిల్లా అధ్యక్షుడు కట్టయ్య » సమిశ్రగూడెంలో రజకుల ధర్నా



సమిశ్రగూడెంలో చెరువు వద్ద ధర్నా చేస్తున్న రజకులు

నిడదవోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రజకుల వృత్తి చెరువుల విషయంలో అధికారులను కొందరు తప్పుదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని, ఈ విషయంలో అన్యాయం జరిగితే ఉద్యమానికైనా సిద్ధమని రజకజన సంఘ జిల్లాధ్యక్షుడు చిలకలపల్లి కట్టయ్య అన్నారు. సమిశ్రగూడెంలో రజకుల వృత్తి చెరువు విషయంలో పంచాయతీ అధికారుల వ్యవహార శైలిపై మంగళవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టయ్య మాట్లాడుతూ గ్రామంలో సుమారు 50ఏళ్లుగా రజకులు చెరువు వద్ద వృత్తి చేసుకొంటూ పంచాయతీకి శిస్తు చెల్లిస్తున్నారన్నారు. చెరువు శ్మశాన భూమిలో ఉందని, దానిపై పంచాయతీకి దరఖాస్తు చేసి రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించడం సరికాదన్నారు. అనంతరం తహశీల్దార్ నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘం ఉపాధ్యక్షుడు అవిడి సుబ్రహ్మణ్యం, కె.ఏడుకొండలు, బిక్కవోలు సత్యనారాయణ, ఎ.రామకృష్ణ, అత్తిలి రాము, ఎండీ అక్రమ్ పాల్గొన్నారు.

జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీలకు
మెహనాజ్ ఎంపిక


రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన హనీఫా మెహనాజ్

చాగల్లు, డిశంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్‌లో జాతీయస్థాయి పోటీలకు చాగల్లుకు చెందిన హనీఫా మెహనాజ్ ఎంపికయ్యింది. రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో కాకినాడ ఇంటర్నేషనల్ రింక్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని నాలుగు బంగారు పతకాలు సాధించి స్టేట్ చాంపియన్‌గా నిలిచింది. మైసూర్‌లో స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ నెల 5వ తేదీ నుంచి 15వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనుంది. అలాగే స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మూడు బంగారు పతకాలు సాధించింది. మన రాష్ట్రం తరుపున అండర్-17 విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ఈనెల 25వ తేదీ నుంచి 30 వరకు జరిగే పోటీల్లో మెహనాజ్ పాల్గొననుంది. మెహనాజ్ రాజమహేంద్రవరం శ్రీగౌతమి స్కూల్లో పదో తరగతి చదువుతోంది. క్రీడల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.


వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


వృద్ధాశ్రమానికి ప్లేట్‌లు అందజేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

కొవ్వూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో మంగళవారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అచ్చాయమ్మకాలనీలో పొట్టి శ్రీరాములు, ప్రభుత్వ పాఠశాలలో గాంధీజీ విగ్రహాలను ఏర్పాటుచేశారు. గామన్‌బ్రిడ్జి వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం సిమ్మెంటు బెంచీలు, ప్రెస్‌క్లబ్‌కు తలుపులు, గోవులకు దాణా, వాత్సల్యా వృద్ధాశ్రమంలో వృద్ధులకు స్టీలు ప్లేటులు, గ్లాసులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. క్లబ్ జిల్లా గవర్నర్ వలివేటి ప్రసాద్ పర్యటన సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు దేవతు కృష్ణప్రసాద్, రాఘవ రమాకాంత్, సత్యవరపు గురునాథ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే ప్రసాద్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

అనంతపల్లి కాల్వలో దూకినట్టు ఆనవాళ్లు
గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు


అనంతపల్లి కాల్వలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

నల్లజర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నభీపేట గ్రామానికి చెందిన మర్రి నవీన్‌కుమార్ మంగళవారం పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు,బంధువులు పలు ప్రాంతాల్లో వెతికారు. ఈ క్రమంలో అనంతపల్లి వద్ద పోలవరం కుడి కాల్వపై నిర్మించిన సైఫాన్ బ్రిడ్జిపై నవీన్ చెప్పులు, బైక్ ఉండడంతో కాల్వలోకి దూకినట్టు ఆనవాళ్లు కనిపించాయి. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నల్లజర్ల సీఐ శ్రీనివాస్ గజ ఈతగాళ్లతో మధ్యాహ్నం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ప్రయత్నించినా నవీన్ ఆచూకీ లభించలేదు. బుధవారం కూడా గాలింపు చేపట్టి నవీన్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తామని సీఐ చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

రాజానగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5వ తేదీన జరుగనున్న ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రాజానగరం నియోజకవర్గం వ్యాప్తంగా 215మంది ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఆరోజు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటు హక్కును వినియోగించు కోనున్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక చందాసత్రం సమీపంలోని కోదండ రామాలయం పునఃనిర్మాణానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.లక్ష పైబడి విలువైన ఐరెన్ మంగళవారం ఆలయ కమిటీకి అందించారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యిన్నమూరి దీపు, మండవిల్లి శివ, నాయకులు వెంకన్న, జయరామ్, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రత్యేకవసరాల పిల్లలకు నైపుణ్య శిక్షణ

» జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ సుభాషిణి
» అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం
» పలుచోట్ల విద్యార్థులకు పోటీలు.. బహుమతుల ప్రదానం


దివాన్‌చెరువు సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీ సుభాషిణి

దివాన్‌చెరువు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్టు సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పలుచోట్ల మంగళవారం నిర్వహించారు. దివాన్‌చెరువులోని భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఏపీసీ సుభాషిణి విచ్చేసి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయాలని సూచించారు. అలాగే పిల్లల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో భవిత కేంద్రాలకు వచ్చే 1600 మంది పిల్లలకు నాలుగురకాల అలవెన్సుల కింద రూ.23 లక్షలు విడుదల చేశామన్నారు. దివాన్‌చెరువులోని భవిత కేంద్రానికి వస్తున్న 20 మంది పిల్లల్లో 14 మంది రాజానగరం నుంచే వస్తున్నారన్నారు. ఆ పిల్లల తల్లిదండ్రుల కోరిక మేరకు భవిత కేంద్రాన్ని రాజానగరంలోని ఉన్నత పాఠశాలలో ప్రారంభించేందుకు అనుమతిచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలోని పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఝాన్సీ, ఏఎంవో గౌరీ శంకర్, సీఎంవో శ్రీనివాస్, రాజానగరం ఎంఈవోలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: స్థానిక మండల సమాఖ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యూనియన్ బ్యాంక్ మేనేజర్ కేవీ రంగనాథం మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంఘాలకు రుణాలు ఇవ్వడానికి తమ బ్యాంక్ ముందుంటుందని, తమ బ్యాంక్‌లో హేమాద్రి విభిన్న ప్రతిభావంతుల స్వయం సహాయ సంఘానికి రూ.20 లక్షల రుణం ఇచ్చామని, వారు ప్రతి నెలా రుణం చెల్లిస్తున్నారన్నారు. సర్ప్ ఉన్నతి డైరెక్టర్ రాజా ప్రతాప్ ఆన్‌లైన్‌లో పాల్గొని మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు జీవనోపాధులు చేసుకుంటూ వారి కుటుంబాన్ని పోషించుకోవాలని వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణను, మేనేజర్ రంగనాథాన్ని సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు దృష్టి ప్రదాత అంధుల పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్న, సూర్యదేవర రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగు దినోత్సవం నిర్వహించి, ఆటల పోటీలు జరిపి బహుమతులు అందజేశారు. ఎంఈవో యు.గురునాథం మాట్లాడుతూ దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీయడం, వారికి మెరుగైన విద్య బోధన అందించేందుకు ప్రభుత్వం భవిత కేంద్రాలను నిర్వహిస్తోందన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 సుభాకర్, ఉపాధ్యాయురాలు శిరీష, మానవ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక భవితా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగ బాలలకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విజేతలకు మద్దిపాటి గంగరాజు ఆర్థిక సాయంతో సమకూర్చిన బహుమతులను ఎంఈవో శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతిభకు వైకల్యం అడ్డుకాకూడదన్నారు. దివ్యాంగులను ప్రతిఒక్కరు ప్రేమతో ఆదరించి అక్కున చేర్చుకోవాలన్నారు. వారిలో ఉన్న ప్రతిభను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరపల్లి: గొల్లగూడెంలోని భారతీ దివ్యాంగుల ఆశ్రమంలో దివ్యాంగుడైన కండెల్లి శ్రీను, పాకా పోసియ్య, ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఆశ్రమ చైర్మన్ కాగిత భాస్కరరావు మాట్లాడుతూ వైకల్యం శరీరానికే కానీ మనస్సుకు కాదని అన్నారు. 20 ఏళ్లుగా ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండలంలోని దివ్యాంగులు స్కూటీలపై ర్యాలీ నిర్వహించి అనంతరం ఆశ్రమలో కేకును కట్ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు ఫణికుమార్, సీహెచ్.వెంకట్రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కొవ్వూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి


పెరవలిలో ఎంపీడీవో, బ్యాంక్ మేనేజర్‌లకు సన్మానం


గొల్లగూడెంలో కేక్ కట్ చేస్తున్న దివ్యాంగులు


గోపాలపురంలో దివ్యాంగుల దినోత్సవం

ఇసుక రీచ్‌లో నిబంధనలు
పాటించాలి: తహశీల్దార్



తాళ్లపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణదారులకు అందించే ఉచిత ఇసుక తీసుకుని వెళ్లే వారికి కొన్ని నిబంధనలు ఏర్పాటు చేసిందని వాటి ని ఖచ్చితంగా పాటించాలని తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ చెప్పారు. ఇటీవల బల్లిపాడు ఇసుక రీచ్‌లో జరుగుతున్న వివాదాల నేపథ్యంలో ఇసుక ఉచిత విధానాన్ని వివరి చారు. ఇసుక కావలసిన వారు గ్రామ కార్యదర్శి నుంచి అనుమతి పత్రాన్ని తీసుకుని మీసేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఎడ్ల బండి లేదా ట్రాక్టరు ద్వారా తీసుకెళ్లవచ్చని అన్నారు. కొందరు ఇసుక రీచ్ వద్ద వివాదాలకు తావిస్తున్నారని ఏమైనా ఇబ్బందులుంటే తమ సిబ్బందిని అడిగి తెలుసుకోవాలన్నారు. అలాగే లారీలతో ఇసుక కొనుగోలు చేసేవారు, జీపీఎస్ కలిగిన లారీల ద్వారానే ఇసుక రవాణా చేయాలని తెలిపారు. బల్లిపాడు ఇసుక రీచ్ తమ శాఖా సిబ్బంది పర్యవేక్షణలో ఉందని తహశీల్దార్ చెప్పారు.

మునికోటేశ్వరరావుకు సత్కారం

దేవరపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు అక్కిన మునికోటేశ్వరరావును రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన ఇంటి వద్ద ఆలిండియా విష్ణు సహస్ర నామ కల్చరల్ ఫెడరేషన్ సభ్యులు, రాష్ట్ర మానవత కన్వీనర్ బలుసు సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో మానవత నల్లజర్ల చైర్మన్ బీవీ సుబ్బారావు, కరుటూరి పానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ
ఎన్నికకు సర్వం సిద్ధం

గోపాలపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు తహశీల్దార్ అజయ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో 283 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ప్రతీ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాల యంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గోపాలపురం మండలంలో 54, దేవరపల్లి 90, నల్లజర్లలో 139 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, రెండు రోజులు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

వ్యక్తి అదృశ్యం

కొవ్వూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ సత్యనారాయణ తెలిపారు. దేవరపల్లి మండలం సంగాయిగూడెం గ్రామానికి చెందిన యలమాటి శ్రీనివాసరావు సోమవారం తన కారులో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. తిరిగి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో కొవ్వూరు గోపాదాలరేవు వద్ద కారు, సెల్‌పోను, బట్టలు కనిపించాయి. శ్రీనివాసరావు ఆచూకీ తెలియకపోవడంతో భార్య పద్మకుమారి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

నేడు ఘంటసాల జయంతి

ధవళేశ్వరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఘంటశాల వెంకటేశ్వరరావు జయంతిని బుధవారం ఇరిగేషన్ కార్యాలయం వద్ద పార్కులో ఉన్న ఆయన విగ్రహం వద్ద నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు జీవీ రమణ, యర్రమోతు ధర్మరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తాం

దుద్దుకూరులో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో జిల్లా అధ్యక్షుడు టీకే


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి

దేవరపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చి గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామని జిల్లా పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. దుద్దుకూరులో పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి షర్మిలారెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలని కార్యకర్తలు కోరుకుంటున్నారన్నారు. కాకినాడ పోర్టులో రేషన్ బియ్యం అవినీతిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. గత ప్రభుత్వంలో వేలాది కోట్లు దోచుకున్నారని వారిని పట్టించే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వంపై ఉంద న్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఆదానికి రక్షణ కల్పి స్తోందని, వేల కోట్ల అవినీతికి పాల్పడినా అతడిపై చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చారి మార్టిన్ లూథర్, వెలగా రామకృష్ణ, రాజానగరం ఇన్‌చార్జి డాక్టర్ వడయార్, కాకర్ల శ్రీహరిబాబు, పాలకుర్తి ప్రభాకర్ చౌదరి, అబ్దుల్ సలీం, మురళీకృష్ణ, మండా శ్రీను, బుచ్చిరాజు, పాకా చిన్నబ్బులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన సదస్సులో సీఐ నాయక్


సదస్సులో మాట్లాడుతున్న సీఐ నాయక్

దేవరపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ బీఎస్.నాయక్ అన్నారు. లక్ష్మీపురంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు మంగళవారం ఎస్ఐ బీసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఐ నాయక్ మాట్లాడుతూ సైబర్ మోసాలు, దొంగతనాలు, శాంతిభద్రతలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, సారా బెల్టు షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే నిర్వాహకులపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలపై యువకులు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆసుపత్రుల్లో టిఫా స్కానింగ్ ఉచితం

ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ
పీసీపీఎన్‌డీటీ యాక్టుపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని డీఎంహెచ్‌వో కార్యాలయ సెక్షన్ ఎంపీహెచ్‌ఈవో టి.వెంకటరమణ అన్నారు. రాజమహేంద్రవరం కంబాలపేట పట్టణ ఆరోగ్యకేంద్రంలో సిటీ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలకు పీసీపీఎన్‌డీటీ యాక్టుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆడపిల్లల సమతుల్యత, టిఫా స్కానింగ్ ప్రాముఖ్యతను వివరించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణకు ప్రయత్నిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. టిఫా స్కానింగ్ వల్ల గర్భస్థ శిశువులకు ఉన్న లోపాలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. గోకవరం బస్టాండు వద్ద ఉన్న రాయల్ హాస్పటల్, జీఎస్ఎల్ ఆసుపత్రుల్లో మాత్రమే ఈ టిఫా స్కానింగ్ పరీక్షలు ఉచితం అందుబాటులో ఉన్నాయన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం డిప్యూటీ డెమో డాక్టర్ ఎస్.సత్యకుమార్ పలు సూచనలు చేశారు. ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్, పట్టణ ఆరోగ్యకేంద్రాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం
జిల్లా నూతన కమిటీ ఎన్నిక


ప్రభుత్వ అధ్యాపకుల సంఘం నూతన కమిటీ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎండీ సాధిక్ మహ్మద్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొవ్వూరు), కార్యదర్శిగా కె.దుర్గారావు (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం), కోశాధికారిగా టి.నరసింహమూర్తి (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం), మహిళా కార్యదర్శిగా పి.శ్రీవల్లి (ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా నర్సారెడ్డి వ్యవహరించారు. అధ్యక్షుడు సాధిక్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

రాజానగరం, డిసెంబరు 3: రైతులంతా ఈ-పంట విధిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం పిలుపునిచ్చారు. మండలంలో కలవచర్ల, సీతారాంపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా తాము సాగు చేసుకునే వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలకు విధిగా బీమా చేయించుకోవాలని సూచించారు. వరి పంటకు ఎకరాలకు రూ.630 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉందన్నారు. మొక్కజొన్నకు ఎకరాకు రూ.540, మినుము, పెసర పంటలకు ఎకరాకు రూ.300 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, ఈనెల 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

కొవ్వూరులో గ్రాండ్ క్రిస్మస్


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏ దేవునికి జరగని విధంగా క్రిస్మస్ సందర్భంగా ఏసు ప్రభువుకు మాత్రమే ప్రపంచ వ్యాప్తంగా నెల రోజులపాటు వేడుకలు జరుగుతాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలోని లిటరరీ క్లబ్‌లో యేసయ్య రక్షణ స్వస్థత శాల ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్‌చేశారు.సంఘస్థులు,దైవజనులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు, సందేశాలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలన్నారు.

తాళ్లపూడిలో సెక్షన్ 144

తాళ్లపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న ఎమ్మెల్సీ ఎన్నికలు నేపథ్యంలో మండలంలో 4,5 తేదీల్లో 144 సెక్షను అమలులో ఉంటుందని తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో 61 మంది ఓటర్లున్నారని, వీరందరూ తాళ్లపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 73వ నెంబరు బూత్ వద్ద అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేశామని చెప్పారు.

గోదావరిలో గుర్తుతెలియని
మృతదేహం లభ్యం

కొవ్వూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో గుర్తుతెలియని మగ మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద గోదావరిలో మృతదేహం తేలుతుందని మంగళవారం సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకుని జాలర్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి చేతిపై అమ్మ అని పచ్చబొట్టు ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు కొవ్వూరు పోలీసుస్టేషన్ 94407 96622, 0881 3231100లకు సమాచారం అందజేయాలని సీఐ పి.విశ్వం కోరారు.

పశివేదలలో బైక్ చోరీ

కొవ్వూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి తెలిపారు. చాగల్లు మండలం ఊనగట్ల గ్రామానికి చెందిన అయినం దినేష్‌కుమార్ గత నెల 27న కొవ్వూరు మండలం పశివేదలలో బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ ఉదయం కనిపించలేదు. వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజీమాల్ స్క్రీన్1	: కంగువా
వై.స్క్రీన్2	: మెకానిక్
దేవిశ్రీ(గాయత్రి)	: జీబ్రా
అనన్య	: దేవకీ నందన వాసుదేవా

నిడదవోలు

వీ మ్యాక్స్	: లక్కీ భాస్కర్
రాధాకృష్ణ	: వెనం
శ్రీగణపతి	: అమరన్

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: మట్కా
త్రినాథ్ సినీ మ్యాక్స్	: మట్కా